ANN తెలుగు

Follow: @ANNTELUGU

07-01-2026

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 13 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా

**ఈ సెషన్ ఐదు రోజులు.. 66 మంది ఎమ్మెల్యేల గళం**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఐదు రోజుల పాటు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశాల్లో 13 కీలక బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. మొత్తం 40 గంటల 45 నిమిషాల పాటు సభ్యులు చర్చ చేశారు. సభలో 66 మంది సభ్యులు మాట్లాడినట్లు స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు. ఆమోదం పొందిన బిల్లుల్లో తెలంగాణ పురపాలికల(నాలుగో సవరణ)బిల్లు, హైదరాబాద్ మహానగర పురపాలక కార్పొరేషన్(సవరణ) బిల్లు, హైదరాబాద్ మహానగర పురపాలక కార్పొరేషన్(రెండో సవరణ) బిల్లు, తెలంగాణ ప్రైవేటు విశ్వవిద్యాలయాల( స్థాపన, క్రమబద్ధీకరణ) బిల్లు, తెలంగాణ మోటారు వాహనాలపై పన్ను విధింపు (సవరణ), తెలంగాణ రెగ్యులేషన్ ఆఫ్ ఎపాయింట్ మెంట్స్ టు పబ్లిక్ సర్వీస్ అండ్ రేషనలైజేషన్ ఆఫ్ స్టాఫ్ ప్యాటర్న్ పేస్ట్రక్చర్ బిల్లు, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (ఎమెండ్‌మెంట్) బిల్లులు ఉన్నాయి. ఈ సెషన్ లో ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా, కేసీఆర్ సభకు కాసేపు హాజరయ్యారు. బీఆర్ఎస్ సమావేశాలు బహిష్కరించింది.

### టాప్ న్యూస్



**కవితకు మాట్లాడే అవకాశం ఇవ్వడం**

- పార్లమెంటరీ సంప్రదాయం
- మంత్రి శ్రీధర్ బాబు
- బీజేపీతో ఒప్పందం మేరకే బీఆర్ఎస్ బాయ్ కాట్

02



**కవిత కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యం లేదు**

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సంచలన వ్యాఖ్యలు
- గతంలో దానం, కడియంపై ఇలాగే చెప్పా
- ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో రియల్ భూమ్ పెరిగింది

02



**హైకోర్టుకు రాజాసాబ్**

- రేట్లు పెంచండి ప్లీజ్

02

# కవిత రాజీనామాకు ఆమోదం

## ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లు నోటిఫికేషన్

ఫిబ్రవరిలో కవిత భారీ బహిరంగసభ.. కవిత ఇంటికి క్యూ కట్టిన జనం

జై తెలంగాణ.. జై కవితక్క నినాదాల హోరు

**హైదరాబాద్, మహా :** కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీ పదవి రాజీనామాకు ఆమోదం లభించింది. కవిత రాజీనామాను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మంగళవారం ఆమోదించారు. 2025 సెప్టెంబరులో కవితను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో, ఆమె తన ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆమె రాజీనామా పెండింగ్ లో ఉండగా.. నిన్న కవిత మండలికి హాజరై తన రాజీనామా ఆమోదించాలని స్వయంగా చైర్మన్ ను కోరారు. దీంతో ఆమె రాజీనామాకు గ్రీన్ సిగ్నల్ పడింది. కాగా 2022లో నిజామాబాద్ స్థానిక సంస్థల కోటాలో కవిత ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. రాజీనామాను ఆమోదించడంతో.. ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లు నోటిఫికేషన్ జారీ చేశారు.

మిగతా 2లో

## కవిత యాక్షన్ ప్లాన్ ఇదే

తెలంగాణ జాగృతి రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. హైదరాబాద్‌లోని జాగృతి ప్రధాన కార్యాలయంలో కవిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 23 జాగృతి అనుబంధ సంస్థల నేతలు కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కొత్త పార్టీ ఏర్పాటు వంటి అంశాలపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. 2026 ఫిబ్రవరి 16 లేదా 20వ తేదీన మంచిర్యాలలో భారీ బహిరంగా సభ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. ఇదే సభలో కొత్త పార్టీని ప్రకటించాలని అనుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. అదే సమయంలో కవిత గతంలో టీజీబీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా పని చేసి ఉన్నందున సింగరేణి కార్మికుల్లో ఆమెకు ఉన్న పట్టు మేరకు మంచిర్యాలలో సభ పెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. అంతే కాక ఆమె ఇక్కడి నుంచి పోటీ చేసే అంశంపై కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. కవిత టీజీబీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా పని చేయడంతో ఇక్కడి నుంచి పోటీ చేస్తే ఆమెకు ఉపయుక్తంగా ఉంటుందని సన్నిహితులు, కార్మిక నేతలు సూచించినట్లు సమాచారం. ఈ సమావేశానికి కవిత ఇద్దరు కొడుకులు హాజరు కావడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. తన ఇద్దరు కొడుకులను కవిత ఈ భేటీకి తీసుకు రావడానికి వెనక ఉన్నవ్యూహం ఏంటనే దానిపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. వారిని కూడా ఇక మీదట తన రాజకీయ సభలకు తీసుకువెళ్తారని ప్రచారం సాగుతోంది.





**తెలంగాణలో జిల్లాల మార్పులు**

- మంత్రి పొంగులేటి సంచలన ప్రకటన
- అదృష్ట సంఖ్య కోసం అశాస్త్రీయ విభజన

02



**విద్వేషప్రచారం చేస్తే తాట తీస్తాం**

లోకేష్ హెచ్చరిక

02



**'హోం మంత్రి నేనే' అన్న రాకేశ్ రెడ్డి**

- అమిత్ షాను తీసి నీకిస్తున్నరా.. దానం కౌంటర్
- అసెంబ్లీలో సరదా ముచ్చట్లు

02



పురపోరు 2026

**కొత్తగూడెం కార్పొరేషన్**

# దశాబ్దాల కలకు రూపం

## పాలనలో కొత్త అధ్యాయం

**మహా ప్రత్యేకం, కొత్తగూడెం:** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపాలిటీ వ్యవస్థల బలోపేతం దిశగా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం గత ఏడాది మే నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయంతో మున్సిపల్ కార్పొరేషన్ గా రూపాంతరం చెందింది. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తితో సీఎం రేవంత్ రెడ్డి జంట మునిసిపాలిటీల విలీనానికి ఆమోదం తెలిపారు. కొత్తగూడెం–పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయగా, ఫిబ్రవరిలో కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ కు తొలిసారి ఎన్నిక జరగనుంది. కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ కేవలం పరిపాలనా మార్పు మాత్రమే కాదు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి పటంలో కొత్త అధ్యాయానికి నాంది.

ప్రత్యేక కథనం 4లో

# విజయ్‌పై సీబీఐ వల

12న హాజరుకావాలని నోటీసులు.. అమిత్ షా గేమ్ అంటున్న విపక్షాలు



**ఢిల్లీ:** కరూర్ తొక్కిసలాటకేసులో నటుడు, రాజకీయ వేత్త, తమిళగ వెట్రి కళగం చీఫ్ విజయ్ కు సీబీఐ సమన్లు పంపింది. ఈనెల 12న తమ ముందు హాజరు కావాలని కోరింది. కరూర్ జిల్లా వేలుస్వామిపురంలో 2025 సెప్టెంబర్ 27న టీవీకే ర్యాలీ నిర్వహించింది. పెద్ద సంఖ్యలో జనం తరలిరావడంతో తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసిన సీబీఐ ఇప్పటికే టీవీకే కీలక నేతల స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తునకు మొదట తమిళనాడు ప్రభుత్వం నిరాకరించింది.

మిగతా 2లో



# కోల్డ్ వార్

## హరీష్ కు ప్రమోషన్ పై కేటీఆర్ గుస్సా

- కార్యక్రమాల్లో స్పష్టంగా అసహనం
- పదవి ప్రకటించిన మరుసటిరోజే అసెంబ్లీకి గైర్హాజరు
- తర్వాత ముభావం.. అలక

బీఆర్ఎస్ పార్టీ నుండి సస్పన్షన్ ను గురై తిరుగుబావుటా ఎగరేసిన కవిత ఎపిసోడ్ తెలంగాణ పాలిటిక్స్ లో ఓ వైపు కాక రగిలిస్తుండగానే, బీఆర్ఎస్ ఫ్యామిలీలో అలకలు.. ఆగ్రహాలు, అసంతృప్తులు చల్లారడం లేదు. బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేతగా హరీష్ రావును ప్రకటించడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసంతృప్తికి గురైనట్లు తెలుస్తోంది. ఉపనేతగా ప్రకటించిన మరుసటిరోజే అసెంబ్లీకి కేటీఆర్ గైర్హాజరు కాగా, ఈ నిర్ణయంపై కినుక వహించి అధినేతపై అలకబూనినట్లు బీఆర్ఎస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తర్వాత హరీష్ రావు తో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నా కేటీఆర్ లో ఆప్రభావం స్పష్టంగా కనబడుతోందని, ఫలితంగానే అసహనం ఆయన ప్రసంగాల్లో, కార్యక్రమాల్లో కనబడుతోందన్న విశ్లేషణలు జరుగుతున్నాయి. అలుగుడు గులుగుడు సహజమంటూనే మంగళవారం జనగామలో ఇటీవల కాలంలో ఎన్నడూ లేనిరీతిలో పరుష పదజాలం వాడగా, ఆయన స్ఫూర్తిగా ఇతర నేతలు కూడా రెచ్చిపోయారు. కాంగ్రెస్ కోరుకున్నది.. నేతలు చేస్తున్నది రెండూ ఒకటేనన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇంతకాలం కేటీఆరే పార్టీకి సర్వాధికారి.. వారసుడు, కేసీఆర్ తర్వాత పవర్ సెంటర్ అన్న అభిప్రాయం ఉండగా, ఇలాంటి పరిస్థితుల్లోనే హరీష్ వద్దకు నేతలు క్యూ కడుతున్నారు. బిఆర్ఎస్ ఎల్పీ ఉపనేతగా చేశాక ఎమ్మెల్యేలతో హరీష్ కు అనుబంధం పెరుగుతుందని, భవిష్యత్తులో తనకు ఇబ్బందులు తెచ్చి పెడుతుందని, ఏ పదవి లేనపుడే హరీష్ వద్దకు నేతలు క్యూ కట్టగా.. ఇపుడు శాసనసభలో కేసీఆర్ తర్వాత పదవి కట్టబెట్టిన తర్వాత ప్రాబల్యం పెరుగుతుందన్న ఆందోళన కేటీఆర్ శిబిరంలో కనబడుతోంది. ఓ వైపు కేటీఆర్ తీరు గమనించినా, మరోవైపు ఇమాట నాలుక జారితో తిరిగి తీసుకోలేమని, ఒకసారి మనసు విరిగితే అతకదని పరోక్షంగా కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కేసీఆర్ హరీష్ రావు సంక్షోభసమయంలో పార్టీలో ఉత్సాహం నింపుతాడని భావించగా, సరికొత్త పరిణామాలు పార్టీలో అంతర్గత చర్చకు దారితీస్తున్నాయి. కేసీఆర్ ఆదేశాలతో అసెంబ్లీ బాయ్ కాట్ జరగ్గా, తర్వాత పరిణామాలపై పార్టీలో రకరకాల చర్చలు జరుగుతున్నాయి.

-మహా, హైదరాబాద్



# విజయ్‌పై సీబీఐ వల

## 12న హాజరుకావాలని నోటీసులు.. అమిత్ షా గేమ్ అంటున్న విపక్షాలు

(మొదటిపేజీ తరువాయి)

కేసును ప్రత్యేక విచారణ బృందం కి అప్పగించింది. శాంతి భద్రతలు.. రాష్ట్ర పరిధిలోకి వచ్చే అంశమని, సిట్ సమర్థవంతంగా దర్యాప్తు జరుపుతుందని కోర్టు ముందు తమిళనాడు ప్రభుత్వం వాదించింది. దీనిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని సుప్రీంకోర్టును టీవీకే ఆశ్రయించింది. కరూర్ తొక్కిసలాట ఘటన దేశాన్ని కుదిపేసిందని, దీనిపై స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దర్యాప్తును సిట్ నుంచి సీబీఐకి అప్పగించింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన సీబీఐ ఈ ఈవెంట్‌కు పర్మిషన్ ఇవ్వడం దగ్గర నుంచి క్రౌడ్ మేనేజ్మెంట్ చర్యలు, పోలీసుల మోహరింపు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ వంటి అంశాలపై విచారణ జరిపింది. టీవీకే నేతలు, అధికారుల స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. ఇపుడు నేరుగా విజయ్ కే సీబీఐ నోటీసులిచ్చింది.

### పొలిటికల్ యాంగిల్

బీజేపీ తో పొత్తుకు విజయ్ ససేమిరా అంటున్నారు. తమది లౌకికవాద పార్టీ అని, అవసరమైతే కాంగ్రెస్ తో పొత్తుకు రెడీ అంటూ సంకేతాలు పంపారు. విజయ్ ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఏపీలో జనసేనలా కాకుండా మరింత పకడ్బందీగా విజయ్ రాజకీయ వ్యూహాలు అమలుచేస్తున్నారు. తాను కింగ్ లా ఉండాలని భావిస్తున్నారు. ఇప్పటికే బిజెపి, ఏఐడికెంకెతో పొత్తు పెట్టుకోగా, విజయ్ తో పొత్తుకు ప్రయత్నాలు చేస్తున్నది. వీటికి అంగీకరించకపోవడం వల్లే అమిత్ షా వ్యూహాత్మకంగా సీబీఐని ప్రయోగించారని టీవీకే నేతలతోపాటు పలు రాజకీయపక్షాలు విమర్శిస్తున్నాయి.

# ప్రభుత్వ ఉద్యోగులకు కోటి రూపాయల భీమా

## త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అమలు.. అసెంబ్లీ డిప్యూటీ సీఎం కీలక ప్రకటన

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రతకు భరోసా కల్పిస్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని అన్ని శాఖల సిబ్బందికి ఏకంగా రూ. 1 కోటి విలువైన ప్రమాద బీమా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని వెల్లడించారు. మంగళవారం శాసనసభలో భట్టి విక్రమార్క ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం సింగరేణి, విద్యుత్ శాఖ కార్మికులతో ప్రారంభమైన ఈ భారీ బీమా పథకాన్ని భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని విభాగాలకు వర్తింపజేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగి భద్రతా హక్కును కాపాడటమే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సింగరేణి కార్మికులకు, డిస్కమ్స్‌లో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులకు ఈ రూ. 1 కోటి ప్రమాద బీమా సౌకర్యాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే దీనిని కేవలం రెండు శాఖలకే పరిమితం చేయకుండా..రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు కూడా భవిష్యత్తులో వర్తింపజేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన ప్రకటించారు. బ్యాంకుల ద్వారానే ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం వల్ల ప్రభుత్వం లేదా ఆయా సంస్థలపై అదనపు ఆర్థిక భారం పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. కేవలం బీమా మాత్రమే కాకుండా కార్మికుల ఆరోగ్య సంరక్షణపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సింగరేణి ఏరియా ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సింగ్, ఇతర సిబ్బంది పోస్టులను రాబోయే మార్చి నెల నాటికి పూర్తిగా భర్తీ చేస్తామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. అంతేకాకుండా సింగరేణి కార్మికుల కోసం గోదావరిఖనిలో అత్యంత ఆధునికమైన 'క్యాత్ ల్యాబ్' ను మరో 75 రోజుల్లోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇది గుండె సంబంధిత సమస్యలతో బాధపడే కార్మికులకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ఏళ్ల తరబడి సింగరేణి కోసం శ్రమించిన విశ్రాంత ఉద్యోగుల సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం విస్మరించలేదని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇళ్ల నిర్మాణం కోసం స్థలాల కేటాయింపు, గృహ వసతి కల్పన వంటి అంశాలపై సింగరేణి బోర్డుతో చర్చించి త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే 2047 నాటికి తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టే లక్ష్యంతో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆయన సభలో ప్రవేశపెట్టారు.

# హైకోర్టుకు రాజాసాబ్

## రేట్లు పెంచండి ప్లీజ్

**హైదరాబాద్, మహా:** తెలుగు రాష్ట్రాల్లో టిక్కెట్ ధరల పెంపు, అదనపు షోలకు అనుమతి కోరుతూ 'రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్' చిత్ర నిర్మాతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభాస్ నటించిన 'రాజాసాబ్', చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రాలు విడుదల కానున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాల టిక్కెట్ ధరలు పెంచుకోవడానికి అవకాశం కల్పించాలని నిర్మాతలు ఇదివరకే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను కోరారు. టిక్కెట్ ధరలు పెంచకుండా, అదనపు షోలు కల్పించకుండా గతంలో సింగిల్ బెంచ్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో రెండు చిత్రాల నిర్మాతలు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు.

# తెలంగాణలో జిల్లాల మార్పులు

- మంత్రి పొంగులేటి సంచలన ప్రకటన
- అదృష్ట సంఖ్య కోసం అశాస్త్రీయ విభజన

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో గత ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజన ఏమాత్రం శాస్త్రీయంగా లేదని, దీనివల్ల పరిపాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. గత పాలకులు ప్రజల విజ్ఞప్తులను, భౌగోళిక పరిస్థితులను పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం, కేవలం అదృష్ట సంఖ్యల ఆధారంగానే జిల్లాలను, మండలాలను ఏర్పాటు చేశారని విమర్శించారు. దీనివల్ల ఒకే నియోజకవర్గంలోని మండలాలు వేర్వేరు జిల్లాల పరిధిలోకి వెళ్లాయని, ప్రజలు తమ పనుల కోసం వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మండలాల ఏర్పాటు, జిల్లాల పునర్వ్యవస్థీకరణ ఇష్టానురీతిలో జరిగాయి. తమను పొగిడినవారిని ఒక విధంగా, పొగడని వారికోసం మరో విధంగా, అదృష్ట సంఖ్యను ఊహించుకొని అశాస్త్రీయంగా జిల్లాల విభజన చేశారన్నారు. రాష్ట్రంలో కొత్త మండలాలు, డివిజన్ల ఆవశ్యకతను కూడా గుర్తించామని, ప్రస్తుత జిల్లాల ఏర్పాటు వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను సరిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి తెలిపారు. ప్రజా సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాన్ని మరోసారి శాస్త్రీయ పద్ధతిలో పునర్వ్యవస్థీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా ఉన్న లోపాలు, ప్రజా సమస్యలపై అధికారుల నుంచి ప్రభుత్వం ప్రత్యేక నివేదికలను కోరిందని, ఆ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఆయన వెల్లడించారు. జిల్లాల మార్పులు లేదా చేర్పుల విషయంలో ప్రభుత్వం ఎటువంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోదని మంత్రి హామీ ఇచ్చారు. అధికారుల నివేదిక అందిన తర్వాత, దానిపై మంత్రివర్గంలో లోతుగా చర్చించి, అనంతరం శాసనసభలో సభ్యులందరి అభిప్రాయాలను తీసుకుంటామని చెప్పారు. పరిపాలన వికేంద్రీకరణ అనేది కేవలం అంకెల్లో కాకుండా, ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు చేరువగా ఉండాలనే లక్ష్యంతోనే ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ఉంటుందని పొంగులేటి స్పష్టం చేశారు.

# 'హోం మంత్రి నేనే' అన్న రాకేశ్ రెడ్డి

- అమిత్ షాను తీసి నీకిస్తున్నరా.. దానం కౌంటర్
- అసెంబ్లీలో సరదా ముచ్చట్లు

**హైదరాబాద్, మహా:** అసెంబ్లీ లాబీలో బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ల మధ్య మంగళవారం సరదా సంభాషణ చోటు చేసుకుంది. నేను హోం మంత్రిని అంటూ రాకేశ్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. దీనికి దానం నాగేందర్ కౌంటర్ ఇస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తొలగించి.. రాకేశ్ రెడ్డిని చేస్తారంటూ కౌంటర్ ఇచ్చారు. సభలో బీఆర్ఎస్ వాక్ఔట్ చేసిన పది మంది ఉన్నారని చర్చ అని రాకేశ్ రెడ్డి అనగా.. తాను ఎప్పుడైనా యుద్ధానికి సిద్ధం అని దానం రిప్లై ఇచ్చారు. వీరిద్దరి సంభాషణ కొనసాగుతుండగానే వీరి సంభాషణల్లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. పది మంది ఎమ్మెల్యేలు టెక్నికల్ గా బీఆర్ఎస్ లోనే ఉన్నట్లు అని టీపీసీసీ చీఫ్ అన్నారు.

# కవిత కాంగ్రెస్ లో చేరినా ఆశ్చర్యం లేదు

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సంచలన వ్యాఖ్యలు
- గతంలో దానం, కడియంపై ఇలాగే చెప్పా
- ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో రియల్ భూమ్ పెరిగింది

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కవిత కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ సందర్భంగా సంచలన కామెంట్స్ చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి మా పార్టీలోకి వస్తారని అనుకున్నా మా వచ్చారు కదా? ఇప్పుడు కవిత కూడా కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదని వ్యాఖ్యానించారు. త్వరలో కవిత సొంత పార్టీ ప్రారంభించబోతున్నారనే ప్రచారం వేళ మల్‌రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయాంగా ఆసక్తిని రేపుతున్నాయి.

**నాకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే నష్టం : మల్‌రెడ్డి రంగారెడ్డి**

మరోవైపు మంత్రి పదవి ఆశిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే నష్టం అన్నారు. నిరాకరిస్తే నాకేం నష్టం లేదు. ఈ విషయంలో పార్టీ పెద్దలు ఆలోచించాలన్నారు. రెండు కోట్ల మంది ప్రజలు ఉన్న రంగారెడ్డి జిల్లాకు ఇంత వరకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. ఇక రంగారెడ్డి జిల్లా పేరు మార్పు అనేది ఊహాగానమేనని రంగారెడ్డి జిల్లాలో ఎన్ని మున్సిపాలిటీలు అయినా చేసుకోవచ్చు. కానీ జిల్లా స్వరూపం మారొద్దన్నారు. ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో రియల్ భూమ్ పెరిగింది... భూముల రేట్లు పెరుగుతున్నాయని భూములు ఎవరూ అమ్మడం లేదు. ఫార్మాసిటిపై పోరాటం చేసినందుకే గతంలో నన్ను కేసీఆర్ ఓడగొట్టారని కానీ ఫార్మాసిటి వచ్చి ఉంటే 50 కిలోమీటర్ల మేర కాలుష్యం అయ్యేదన్నారు.

# కవితకు మాట్లాడే అవకాశం ఇవ్వడం

- పార్లమెంటరీ సంప్రదాయం
- మంత్రి శ్రీధర్ బాబు
- బీజేపీతో ఒప్పందం మేరకే బీఆర్ఎస్ బాయ్ కాట్

**హైదరాబాద్, మహా:** కవితకు మండలిలో మాట్లాడే అవకాశం ఇవ్వడం అనేది పార్లమెంటరీ సాంప్రదాయమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కేసీఆర్ సైతం అసెంబ్లీలో మాట్లాడి రాజీనామా చేశారని, రాజీనామా చేసినప్పుడు సభ్యులకు మాట్లాడే హక్కు ఉంటుందన్నారు. బీఏసీ సమావేశంలో బిఆర్ఎస్ లేవనెత్తిన అంశాలపై అసెంబ్లీలో చర్చ చేశామని, ఎలాంటి కారణం లేకుండా బిఆర్ఎస్ సభను బాయ్ కాట్ చేసిందన్నారు. ప్రతిపక్షం ఉండాలని కోరుకుంటామని, క్రిష్ణా నదీ జలాలు, హిల్ట్ పాలసీలపై చర్చ చేశామన్నారు. హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ బయట అసత్య ప్రచారం చేసిందని, బిఆర్ఎస్ కు రాజకీయ ప్రయోజనాలు ముఖ్యమన్నారు. బీజేపీతో ఉన్న అంతర్గత ఒప్పందం మేరకే బిఆర్ఎస్ సభను బాయ్ కాట్ చేసిందన్నారు.

# విద్వేషప్రచారం చేస్తే తాట తీస్తాం

## లోకేష్ హెచ్చరిక




**అమరావతి, మహా:** వాక్ స్వాతంత్య్రం పేరుతో వ్యవస్థీకృతంగా చేసే విద్వేష ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అమరావతి సచివాలయంలో మంగళవారం జరిగిన కీలక సమావేశంలో మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా దుర్వినియోగంపై కఠిన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా మహిళలను కించపరిచేలా అసభ్య పోస్టులు పెట్టే వారిపై, వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజాస్వామ్యంలో సద్విమర్శలు అవసరమని, కానీ కుట్రపూరిత పోస్టులు సమాజానికి చేటని ఆయన పేర్కొన్నారు.

### ముఖ్యమైన నిర్ణయాలు.. ఆదేశాలు

డీప్ ఫేక్ అరికట్టాలి: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి సృష్టించే 'డీప్ ఫేక్' కంటెంట్, అసభ్యకర వీడియోలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. నిర్ణీత వయస్సు నిబంధన: నిర్ణీత వయస్సు వచ్చిన తర్వాతే సోషల్ మీడియాను వీక్షించేలా లేదా ఖాతాలు తెరిచేలా కొత్త నిబంధనలను రూపొందించే అంశాన్ని పరిశీలించాలని కోరారు. అంతర్జాతీయ చట్టాల అధ్యయనం: ఆస్ట్రేలియా, యూకే, యూరోపియన్ యూనియన్ వంటి దేశాల్లో అమలులో ఉన్న కఠినమైన సోషల్ మీడియా నియంత్రణ చట్టాలను అధ్యయనం చేసి, ఏపీలో కూడా బలమైన లీగల్ ఫ్రేమ్‌వర్క్ తీసుకురావాలని నిర్ణయించారు. విదేశీ ఖాతాలపై నిఘా: విదేశాల్లో ఉంటూ ఏపీలో అశాంతి రేకెత్తించేలా పోస్టులు పెట్టే వారిని గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకునేలా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. విద్వేషపూరిత పోస్టులపై ఫిర్యాదు అందిన నెల రోజుల్లోనే చార్జిషీటు దాఖలు చేసేలా పోలీసు వ్యవస్థను వేగవంతం చేస్తామని తెలిపారు. అభ్యంతరకర పోస్టులు పెట్టే వారి ఖాతాలను తక్షణమే సస్పెండ్ చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వం లేదా న్యాయవ్యవస్థను లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేసే వారిపై రాజద్రోహం వంటి కఠిన శిక్షలు పడేలా చట్టం ఉంటుందని హోంమంత్రి హెచ్చరించారు. సమావేశంలో మంత్రులు కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్ మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# టిక్కెట్ల కోసం నా వద్దకు ఎవరూ రావొద్దు

## టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో టిక్కెట్ల కోసం తన వద్దకు ఎవరూ రావొద్దని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనను మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పిలవొద్దని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎమ్మెల్యే కానున్న నిర్మలా జగ్గారెడ్డిని ఈ ఎన్నికల ప్రచారానికి పిలవాలని సూచించారు. జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణ ప్రజలు విశ్వసిస్తారని ఆయన అన్నారు. ఆమె గెలుపు కోసం చేసే వాగ్ధానాలన్నీ తానే నెరవేరుస్తానని భరోసా ఇచ్చారు. తన జీవితంలో తాను పోలీసులను ఎదిరించి రాజకీయం చేశానని గుర్తు చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని తాను ఎప్పుడూ రాజకీయం చేయలేదని అన్నారు. అధికారంలో ఉన్నామని పోలీసులను అడ్డుపెట్టుకుని గెలవాలని చూడవద్దని అన్నారు. ఈ ఎన్నికల్లో టిక్కెట్ల కోసం గాంధీ భవన్‌కు వెళ్లి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు ఇచ్చే హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి వాటిని నెరవేర్చే బాధ్యత తనదేనని అన్నారు. ఎన్నికల్లో పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను ఓడించాలని చూస్తే వారిపై వేటు ఖాయమని హెచ్చరించారు.

# ఉత్తరప్రదేశ్ లో 2.89 కోట్ల ఓట్ల తొలగింపు

## ఎస్ఐఆర్ ఎఫెక్ట్ ..

### రాష్ట్ర ఓట్లలో 18.9శాతం ఔట్

**మహా :** దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియతో లక్షలాది ఓట్లు తొలగించబడుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో దాదాపు 2.89 కోట్ల మంది ఓటర్ల పేర్లను ముసాయిదా జాబితా నుంచి తొలగించడంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. చనిపోవడం, వలస వెళ్లడం, చిరునామాలో మార్పులు వంటి కారణాలతో పాటు, ఒకే వ్యక్తి పేరు పలుచోట్ల నమోదవ్వడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. జనవరి 6న ప్రచురించిన ఈ ముసాయిదా జాబితా ప్రకారం.. తొలగించబడిన ఓటర్లు తమ అభ్యంతరాలను ఫిబ్రవరి 6 వరకు తెలియజేయవచ్చని, అర్హులైన వారు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో దాదాపు 18.7 శాతం మంది పేర్లు తొలగించబడటం సంచలనంగా మారింది. ఈ భారీ తొలగింపులపై ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్, ఎస్పీ సహా ఇతర ప్రధాన పార్టీలు దీనిపై నిరసన వ్యక్తం చేస్తున్నాయి.

# కవిత కన్నీరుపై కేటీఆర్ రియాక్షన్

- కుటుంబంలో అలుగుడు, గులుగుడు సహజం
- ఏదైనా ఉంటే ఇంట్లో కొట్లాడాలని వ్యాఖ్య
- జనగామ సభలో మాట్లాడిన కేటీఆర్
- కేసీఆర్ చెప్పు దూళికి కూడా రేవంత్ సరిపోడన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

**జనగామ, మహా :**

"కుటుంబం అన్నాక సమస్యలు ఉండటం సహజమని, అక్కడక్కడ అలుగుడు, గులుగుడు లేకపోతే అది అసలు కుటుంబమే కాదని" కేటీఆర్ వ్యాఖ్యానించారు. కవిత శాసనమండలిలో కన్నీటి ప్రకటన తర్వాత జనగామలో నిర్వహించిన సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా పరోక్షంగా కీలక వ్యాఖ్యలు చేశారు. కుటుంబం అన్నాక సమస్యలుంటాయి, అక్కడక్కడ అలుగుడు, గులుగుడు ఉంటది, లేకుంటే కుటుంబమే కాదు, ఏదైనా ఉంటే ఇంట్లో అనుకోవాలి, కలిసి కొట్లాడాలన్నారు. కవిత కుటుంబంతో బంధం తెంచుకుంటున్నానని రాజకీయ శక్తిగా మారి తిరిగి వస్తానని ప్రకటించిన సందర్భంలో కేటీఆర్ వ్యాఖ్యలు కీలకంగా మరాయి. జనగామ పట్టణంలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ భూగోళంపై కానీ, నదులపై కానీ కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. గోదావరి ఎక్కడుందో తెలియని వ్యక్తి కేసీఆర్ గారికి పాఠాలు చెబుతున్నారని, అసలు సంబంధం లేని 'భాక్రానంగల్' ప్రాజెక్టు తెలంగాణలో ఉందని చెప్పడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని మండిపడ్డారు. "పాలన అంటే మూటలు మోయడం కాదు, ప్రజల కష్టాలు తీర్చడం" అని వ్యాఖ్యానిస్తూ, రేవంత్ రెడ్డికి తెలివి తక్కువ మాటలు తప్ప అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని కేటీఆర్ ఆరోపించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ చెప్పిన రూ.15,000 రైతుబంధు, రూ.500 బోనస్, కౌలు రైతులకు సాయం వంటివి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. నాడు నిరుద్యోగులను రెచ్చగొట్టి ఓట్లు వేయించుకున్న రాహుల్ గాంధీ, ఇప్పుడు ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి మోసం చేశారని, తులం బంగారం దేవుడెరుగు.. కనీసం బతుకమ్మ చీరలు కూడా పెట్టలేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు పుస్తెల తాడు తాకట్టు పెట్టే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణను సాధించిన మొనగాడు కేసీఆర్ అని, ఆయన చెప్పు ధూళికి కూడా రేవంత్ రెడ్డి సరిపోడని కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. తన చదువుపై రేవంత్ రెడ్డి ఎందుకు ఏడుస్తున్నారో అర్థం కావడం లేదని, తల్లిదండ్రులు చదువుకోమని పంపిస్తే రేవంత్ రెడ్డి లంగా పనులు చేస్తూ పెయింటింగులు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఒక ప్రెస్ మీట్ పెడితేనే రేవంత్ రెడ్డి ఆగమాగం అవుతున్నారని, ఒకవేళ కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ రెడ్డి గుండె ఆగి చనిపోతారేమోనని వ్యంగ్యంగా అన్నారు. తన సొంత సెక్యూరిటీ సిబ్బందిని ప్రజల ముందే కొడుతున్న రేవంత్ తీరును చూస్తుంటే ఆయనకు పిచ్చి పట్టినట్లు ఉందని, ఆయన్ని కట్టివేయాలని రేవంత్ భార్య గీతకు సూచించామని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ వేధింపులను, బెదిరింపులను తట్టుకొని నిలబడి సర్పంచులుగా గెలిచిన బీఆర్ఎస్ కార్యకర్తలకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. "జనగామ ర్యాలీ చూస్తుంటే కేసీఆర్ గారు మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యారనిపిస్తోంది" అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు మళ్ళీ గులాబీ జెండా వైపు చూస్తున్నారని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఇదే ఉత్సాహంతో పనిచేసి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. పదవుల కోసం పార్టీ మారిన కడియం శ్రీహరి వంటి వారిని ప్రజలే బుద్ధి చెబుతారని, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి వీరులు పుట్టిన ఈ గడ్డపై అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కార్పొరేషన్ గా నల్లగొండ మునిసిపాలిటీ

## అప్ గ్రేడ్ పై అసెంబ్లీ ఆమోదం

**హైదరాబాద్, మహా :** నల్లగొండ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారింది. కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ తెలంగాణ అసెంబ్లీ మంగళవారం బిల్లును ఆమోదించింది. జిల్లా కేంద్రమైన నల్లగొండ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కార్పొరేషన్‌గా మారడం వల్ల పట్టణానికి నిధుల రాక పెరుగుతుందని, మౌళిక సదుపాయాలు మెరుగుపడతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోల్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం సభ దృష్టికి తీసుకొచ్చారు. నకిరేకల్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. ఇదిలా ఉంటే.. నల్లగొండ మున్సిపాలిటీగా ఏర్పడనప్పుడు వార్షిక బడ్జెట్ కేవలం రూ.10వేలు మాత్రమే. పెరిగిన జనాభా కారణంగా ప్రస్తుతం మున్సిపాలిటీ రోజు రోజుకూ విస్తరిస్తూ వచ్చింది. రియల్ ఎస్టేట్ రంగం కూడా విపరీతంగా పెరిగింది. కార్పొరేషన్‌గా అప్ గ్రేడ్ చేసేందుకు రూ.20 కోట్ల వార్షికాదాయంతో పాటు 2 లక్షల జనాభా ఉంటే సరిపోతుంది. అయితే నల్లగొండకు రూ.40 కోట్లకు ఆదాయంతో పాటు 2.5 లక్షల జనాభా ఉండటంతో కార్పొరేషన్‌గా మార్చడం సులువు అయింది.

# కవిత రాజీనామాకు ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చబోతున్నామని కవిత ప్రకటించిన వెంటనే, రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నేతలు, ఉద్యమ కార్యకర్తలు భారీగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆమె నివాసం వద్దకు తరలివచ్చారు. 'తెలంగాణ జాగృతి' రాజకీయ శక్తిగా అవతరించబోతోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించగా, తెలంగాణ జాగృతి కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు కవితకు సంఘీభావం తెలిపారు. తనను కలిసేందుకు వచ్చిన జనసందోహానికి కవిత ఇంటి బాల్కనీలో నిలబడి అందరికీ చేతులు జోడించి అభివాదం చేశారు. అనంతరం కిందకు వెళ్లి ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ, వారి యోగక్షేమాలను కవిత అడిగి తెలుసుకున్నారు. . "ఎలా ఉన్నారు? ఇంట్లో అందరూ బాగున్నారా?" అంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ కాలం నుండి తన వెన్నంటి ఉండి, ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లోనూ మద్దతుగా నిలిచిన ఉద్యమకారులను చూసి ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆమె గొంతు కంపిస్తూ "మీరు లేకపోతే నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు. మీరే నా బలం" అంటూ మాట్లాడారు. దీంతో జాగృతి కార్యాలయం పరిసర ప్రాంతాలు 'జై తెలంగాణ', 'కవితక్క నాయకత్వం వర్ధిల్లాలి' అనే నినాదాలతో మారుమోగాయి. కవిత పోరాట స్ఫూర్తికి మహిళలు జేజేలు పలికారు. గులాబీ బంధనాలు తెంచుకుని తాము మీ వెంటనే నడుస్తామని పలువురు చెప్పారు.

# దమ్ముంటే కాస్కో ట్రంప్

- కొలంబియా అధ్యక్షుడు పెట్రో దిమ్మతిరిగే సవాల్
- మాతృభూమి కోసం అవసరమైతే ఆయుధాలు చేతపడతా

**మహా:** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధించిన అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తీవ్రంగా స్పందించారు. తమ దేశంపై అమెరికా సైనిక చర్య చేపడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తాను ఆయుధాన్ని పట్టుకోనని గతంలో ప్రమాణం చేశానని, కానీ మాతృభూమి కోసం అవసరమైతే వాటిని మళ్లీ చేతపడతానన్నారు. 'నన్ను తీసుకెళ్లండి. ఇక్కడే మీ కోసం ఎదురు చూస్తున్నా' అని గతంలో మదురో సవాల్ చేసినట్లుగానే వ్యాఖ్యానించారు. లాటిన్ అమెరికాలోని మెక్సికో, క్యూబా, కొలంబియాలను ఉద్దేశిస్తూ పద్ధతి మార్చుకోకపోతే వెనిజులా పరిస్థితే ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో పెట్రో తీవ్రంగా స్పందించారు. మ రైతులపై అమెరికా బాంబులు వేస్తే, పర్వత ప్రాంతాల్లో వేలాది మంది గెరిల్లాలు ఉద్యమిస్తారని వ్యాఖ్యానించారు. దేశంలో అనేక మంది అభిమానించే అధ్యక్షుడిని నిర్బంధిస్తే, ప్రజల ఊరుకోరని, ఆగ్రహానికి గురవుతారని పేర్కొన్నారు.

# భవిష్యత్ తరాల కోసమే హిల్ట్ పాలసీ

## నివాస ప్రాంతంగా మారనున్న పారిశ్రామిక ప్రాంతం.. అసెంబ్లీలో శ్రీధర్ బాబు ప్రకటన

**హైదారాబాద్, మహా :** హిల్ట్ పాలసీని సాదాసీదా భూమార్పిడిగా చూస్తున్నారని, దీనిపై సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అసెంబ్లీలో తెలిపారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్ (హిల్ట్) పాలసీపై మంగళవారం అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, హిల్ట్ పాలసీ ద్వారా పారిశ్రామిక ప్రాంతం నివాస ప్రాంతంగా మారుతుందని క్లారిటీ ఇచ్చారు. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని శ్రీధర్ బాబు వెల్లడించారు. 'నగర కాలుష్యాన్ని తగ్గించడానికి పరిశ్రమలను ఓఆర్ఆర్ దాటి తరలించనున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణాన్ని కాపాడటం, రాబోయే తరాలకు పరిశుభ్రమైన, స్థిరమైన భవిష్యత్తును నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది. సమాజం ఆరోగ్యకరమైన, కాలుష్య రహిత వాతావరణాన్ని తదుపరి తరానికి అందిస్తుందో లేదో ఆత్మపరిశీలన చేసుకోవాలి. మన పూర్వీకులు స్వచ్ఛమైన, సుసంపన్నమైన సహజ వాతావరణాన్ని వదిలి వెళ్ళారు. ప్రకృతిని ఒకసారి నాశనం చేస్తే దానిని పునరుద్ధరించలేం.' అని మంత్రి శ్రీధర్ బాబు నొక్కి చెప్పారు. సహజ వనరులను రక్షించడం, భవిష్యత్తు కోసం వాటి మనుగడను నిర్ధారించడం ప్రస్తుత తరం బాధ్యత అని శ్రీధర్ బాబు అన్నారు. హిల్ట్ విధానంపై విమర్శలకు ప్రతిస్పందిస్తూ, కొందరు దీనిని కేవలం భూ మార్పిడి ప్రక్రియగా చూస్తున్నారని చెప్పారు. నగరంలో కాలుష్యాన్ని తగ్గించడానికి ఔటర్ రింగ్ రోడ్ దాటి పరిశ్రమలను తరలించడంతో పాటు నగరంలోని పారిశ్రామిక మండలాలను నివాస ప్రాంతాలుగా మార్చడమే ఈ విధానం ఉద్దేశమని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీపై నిర్మాణాత్మక విమర్శలు స్వాగతిస్తామని, అయితే నిరాధారమైన ఆరోపణలకు పాల్పడేవారు ఆత్మపరిశీలన చేసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. భవిష్యత్ తరాల భవిష్యత్తు, భూమి, పర్యావరణం దృష్టిలో ఉంచుకుని ఈ విధానాన్ని ప్రవేశ పెట్టామని పునరుద్ఘాటించారు. మరోవైపు పోటీతత్వాన్ని కొనసాగించడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ రేటు కంటే తక్కువ ధరలకు పరిశ్రమలకు భూమిని అందించడానికి ప్రయత్నాలు చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ గురించి ప్రస్తావిస్తూ, అక్కడి పరిశ్రమలకు నామమాత్రపు రేటుకు దీర్ఘకాలిక లీజులపై భూమిని అందిస్తున్నారని గుర్తు చేశారు. కాగ్నిజెంట్ దాదాపు 5 వేల మందికి ఉపాధి కల్పించే కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తుండగా, ఇన్ఫోసిస్ పోచారం, విప్రో, కాగ్నిజెంట్‌లలో విస్తరణలు వేల సంఖ్యలో అదనపు ఉద్యోగాలను సృష్టిస్తాయని శ్రీధర్ బాబు వెల్లడించారు. పోచారంలో ఇన్ఫోసిస్ విస్తరణ ద్వారా దాదాపు 17 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. విప్రో విస్తరణ ద్వారా మరో 5 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు.

# ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలుపండి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్




**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల పరిధిలో రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు అవసరం ఉంటే సూచనలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ పట్టణాల పరిధిలో ముసాయిదా ఓటరు జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటికే గత డిసెంబర్ 31న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేసి, అన్ని మున్సిపాలిటీల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు జరిపారని గుర్తు చేశారు. వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, వాటిని పారదర్శకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఇంకనూ ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, తుది జాబితాను వెలువరించక ముందే గడువు (జనవరి 8) లోగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయాల్సిన వాటిని తగిన ఆధారాలు పరిశీలించి తప్పనిసరిగా సవరిస్తామని, ఈ విషయంలో రాజకీయ పార్టీలు కూడా సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో డూప్లికేషన్ లేకుండా, ఇతర వార్డుల పరిధిలో ఉన్న ఓటర్లను వారు నివసిస్తున్న వార్డు పరిధిలోని ఓటరు జాబితాలోకి చేర్చడం, కుటుంబ సభ్యులైన ఓటర్లు అందరూ సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముసాయిదా జాబితాలో ఎక్కడైనా మరణించిన వారి ఓట్లు, రెండు చోట్ల నమోదైన ఓట్ల సమాచారం తెలిస్తే, తగిన ఆధారాలతో వివరాలు అందించాలని, వాటిని తప్పనిసరిగా తొలగిస్తామని అన్నారు. అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించి, వాటిని పరిష్కరించిన మీదట ఈ నెల 10న తుది ఓటరు జాబితాను వెలువరించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మున్సిపల్ కమిషనర్లు సుధీర్ కుమార్, భాస్కర్గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు బిజేపీ నుండి హరిశంకర్, ఏఐఎంఐఎం సయ్యద్ ఫైజుల్లా, వైఎస్సార్ సిపి రజనీకాంత్, టిడిపి శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

# సేంద్రియ ఉత్పత్తుల దృవీకరుణపై శిక్షణ కార్యక్రమం



**హుజూర్ నగర్ మహా** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కృషి విజ్ఞాన కేంద్రం, గడ్డిపల్లి లో నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (ఎన్ ఏ ఏ ఆర్ ఎం) రాజేంద్రనగర్ వారి ఆర్థిక సహాయంతో సేంద్రియ వ్యవసాయంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు సుస్థిర వ్యవసాయం కేంద్రం హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకళ మాట్లాడుతూ రైతులు పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసే అన్ని రకాల ఆహార ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పూలతోటలతో పాటు మిర్చి, పసుపు వంటి సుగంధ ద్రవ్యాల పంటల సాగు చేపట్టిన వారు మా వద్ద నుంచి సేంద్రియ ధ్రువీకరణను సులభంగా పొందవచ్చు అని ఒక్క హెక్టార్ కి 700 రూపాయల ఖర్చు అవుతుంది ప్రతి సంవత్సరంకి సేంద్రియ పంటగా ధృవీకరణ పొందడానికి ఆహార ధాన్యాలు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలకు రెండేళ్లు పడుతుంది. బహువార్షిక పండ్ల తోటలకు మూడేళ్లు పడుతుంది. ఈలోగా కూడా సేంద్రియ ఉత్పత్తిగానే అమ్ముకోవచ్చు. సేంద్రియ ధ్రువీకరణ సర్టిఫికెట్లను ప్రతి ఏటా రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది అని తెలిపారు. తదుపరి సుస్థిర వ్యవసాయం కేంద్రం హైదరాబాద్ డాక్టర్ చంద్రశేఖర్ శాస్త్రవేత్త, వివిధ రకాల పంటలో కషాయలు, ద్రావణాలు తయారీ వాడే పద్ధతులు, పంట మార్పిడి విధానం, వివరించారు. ఈ కార్యక్రమంలో కె.వి.కె శాస్త్రవేత్తలు డి.నరేష్, ఏ.కిరణ్ మరియు 50 మంది రైతులు పాల్గొన్నారు



# విద్యార్థులకు రోడ్డు భద్రత అవగాహన సదస్సు ర్యాలీ

**వలిగొండ, మహా :** వలిగొండ మండల కేంద్రంలో మంగళవారం విద్యార్థులకు రోడ్డు భద్రత అవగాహన కోసం విద్యార్థులచే ర్యాలీ ని వలిగొండ స్థానిక ఎస్సై యుగంధర్ గౌడ్ స్థానిక సర్పంచ్ వెంకట్ పాపిరెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్లు మాట్లాడవద్దని హెల్మెట్ ధరించాలని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని తొందరపాటుతో వేగంగా నడిపి తల్లిదండ్రులకు ఇబ్బందులు చేయొద్దని వారన్నారు ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుండి సాయిగణేష్ గార్డెన్ వరకు కొనసాగింది అనంతరం విద్యార్థులకు అవగాహన నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ పాలకూర్ల వెంకటేశం కొండూరు బాలరాజ్ స్వామిరాజుమల్లేశం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# డిజిటల్ డిపాజిట్ల పేరుతో రూ.850 కోట్ల మోసం

- ఫాల్కన్ ఎండీ అమర్‌దీప్ అరెస్ట్
- ముంబై ఎయిర్ పోర్టులో అదుపులోకి తీసుకున్న తెలంగాణ సీఐడీ

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ కేంద్రంగా జరిగిన భారీ ఆర్థిక కుంభకోణంలో ప్రధాన నిందితుడు, ఫాల్కన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అమర్‌దీప్‌ను తెలంగాణ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. డిజిటల్ డిపాజిట్ల పేరుతో సుమారు రూ.850 కోట్లను వసూలు చేసినట్లు అమర్‌దీప్‌పై ఆరోపణలు ఉన్నాయి. స్కామ్ వెలుగులోకి వచ్చిన వెంటనే నిందితుడు తన భార్యతో కలిసి దుబాయ్‌కు పరారయ్యాడు. దీంతో పోలీసులు అమర్‌దీప్‌పై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. తాజాగా ఆయన గల్ఫ్ దేశాల నుండి ముంబయి విమానాశ్రయానికి చేరుకోగానే, ఇమిగ్రేషన్ అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తెలంగాణ పోలీసులకు సమాచారం అందించడంతో సీఐడీ బృందం ముంబైకి వెళ్లి అమర్‌దీప్‌ను అదుపులోకి తీసుకుంది.

## పెట్టుబడుల పేరుతో మోసాలు

ఫాల్కన్ సంస్థ ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించి, షేర్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో సామాన్య ప్రజలను మభ్యపెట్టి భారీగా డిపాజిట్లు సేకరించింది. ఈ యాప్ ఆధారిత పెట్టుబడుల స్కామ్‌లో ఇప్పటికే సంస్థ సీఈవో అమర్‌దీప్ సోదరుడిని పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. అధిక లాభాలు వస్తాయని నమ్మించి వందల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును దారి మళ్లించినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అమర్‌దీప్ అరెస్ట్‌తో ఈ కుంభకోణానికి సంబంధించిన మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి రానున్నాయి.

# వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం చట్టబద్ధమైన సబ్ ప్లాన్ అమలు చేయాలి



**సూర్యాపేట జిల్లా మహా** : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే వెనుకబడిన తరగతుల (బీసీ) సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ వట్టె జానయ్య యాదవ్ తెలిపారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కు కలెక్టర్ కార్యాలయంలో కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగావట్టె జానయ్య యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగం పైగా ఉన్న వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడాలంటే వారికి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చేయడంతో పాటు చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన అవసరం అత్యంత కీలకమని తెలిపారు. బీసీ వర్గాలకు న్యాయం జరగాలంటే, ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలవ్వాలంటే బీసీ సబ్ ప్లాన్‌ను చట్టబద్ధంగా అమలు చేయడమే ఏకైక మార్గమని, ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు తెలంగాణ రాజ్యాధికార పార్టీ బీసీ వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తుందని, బీసీ సబ్ ప్లాన్ అమలు అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్ అక్బర్ సూర్యాపేటజిల్లా మహిళా అధ్యక్షురాలు కొన్నె మంజుల గౌడ్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు కవిత, ఉపాధ్యక్షురాలు కవిత, పెన్పహాడ్ మండల అధ్యక్షులు ఆవుల అంజయ్య, ఆత్మకూరు మండల అధ్యక్షులు బొల్లె సైదులు, కరుణాకర్, మహేష్, శివ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 10న చలో సూర్యాపేట

## సంగిశెట్టి క్రిస్టఫర్

**వలిగొండ, మహా:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 10న చలో సూర్యపేటలో జరుగు భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే అనేకమంది ఉద్యమకారులు చనిపోయారని మరికొంతమంది ఆర్థికంగా నష్టపోయి రోడ్డున పడ్డారని వారిని ఆదుకోవడానికి వెంటనే ప్రభుత్వం కమిటీని వేయాలని ఆయన డిమాండ్ చేశారు ప్రభుత్వం వెంటనే 250 గజాల ఇంటి స్థలంతో పాటు 25 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఉద్యమకారులు ప్రతి ఒక్కరు మనకు రావలసిన న్యాయమైన డిమాండ్లు నెరవేర్చుకోవడానికి బహిరంగ సభకు హాజరుకావాలని ఆయన అన్నారు

# అసోసియేషన్ లు తడి పొడి చెత్త సేకరణకు సహకరించాలి

## బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలోని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ లు తడి పొడి చెత్త అందజేతకు సహకరించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం హన్మకొండ పరిధి 56 వ డివిజన్ సురేంద్రపురి కాలనీ ప్రాతం లో తడి పొడి చెత్తను వేరు చేసి అందించడం పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు సిబ్బంది తడి పొడి చెత్త ను వేరు చేసి అందించాలని అవగాహన కల్పిస్తూ స్థానికంగా ఉన్న రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ తో పాటు అపార్ట్మెంట్ వాసులు ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్త ను తప్పనిసరిగా వేరు చేసి అందించేలా చూడాలన్నారు అంతే కాకుండా హానికర(హజార్డస్) చెత్తను వేరు గా అందజేయాలని అన్నారు. గోపాల్ పూర్ 60 ఫీట్ రోడ్డు ప్రాంతం లోని సురేంద్ర పూరి కాలనీ లో స్థానికుల అవసరాల మేరకు డ్రైన్ ల ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, ఎం హెచ్ ఓ డా.రాజేష్, డి ఈ రవి కిరణ్, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్, టి పి ఎస్ సతీష్, సానిటరీ ఇన్స్పెక్టర్ భాషా నాయక్, ఆస్కీ ప్రతినిధి డా. రాజ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టకు ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించాలి

## అసెంబ్లీలో బీర్ల అయిలయ్య



**యాదగిరిగుట్ట, మహా:** మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి మంచి డిమాండ్ వచ్చిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మంగళవారం రోజు అసెంబ్లీ లో అన్నారు... గ్రామాల్లో సరిపోను బస్సులను ఏర్పటు చేయాలన్నారు, ఉమ్మడి జిల్లాలోని యాదగిరిగుట్ట పెద్ద డిపో కావున ఎక్కువ ఎలక్ట్రికల్ బస్సులను కేటాయించాలని కోరారు. గ్రామాల్లో పాఠశాలలకు సెలవులు వచ్చిన సమయంలో బస్సులు నడవటం లేదు, పాఠశాలకు సెలవులు ఉన్నప్పుడు కూడా ఆర్టీసీ బస్సులను నడపాలని కోరారు. మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యాన్ని మహిళలకు ఏర్పాటు చేయడం వల్ల, ఆర్టీసి కి మంచి డిమాండ్ ఉందన్నారు. మహిళలు అన్ని సమయంలో ఆర్టీసీబస్సు సేవలను వినియోగించుకుంటున్నారని అన్నారు. కావున యాదగిరిగుట్ట డిపోకు ఎలక్ట్రికల్ బస్సులను అందజేయాలని కోరారు. తెలంగాణ తిరుపతి యాదగిరిగుట్ట దేవస్థానం కొండపైకి వెళ్లే బస్సుల్లో మహిళలకు మహాలక్ష్మీ పథకం వర్తిచటం లేదు, దీని ద్వార నెలకు వచ్చే ఆలయ ఆదాయంలో డిపోకు ఎక్కువ కట్టవలసి వస్తుందని, కొండపైకి వెళ్లే బస్సులో మహిళలకు కూడా మహాలక్ష్మి పథకం వర్తించే లాగా చూడాలన్నారు..ప్రతి గ్రామానికి నూతనంగా ఎలక్ట్రికల్ బస్సులను పునరుద్ధరించాలని కోరారు. గత పది ఏళ్లలో ఆర్టీసీ ధర్నాలు చేసి ఎంతో మంది చనిపోయారు..మన ప్రజాపాలన ప్రభుత్వంలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ లాభాల్లోకి వచ్చి పరిరక్షించి ఆదుకున్నామన్నారు.

# ఒకే కుటుంబంలోని సభ్యుల ఓట్లు అన్ని ఒకే వార్డులో ఉండాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట జిల్లా మహా:** మున్సిపాలిటీలలో ముసాయిదా ఓటర్ జాబితా పై స్వీకరించిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిష్కరించి ఓటర్ జాబితా రూపొందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫిరెన్స్ హాల్ లో మంగళవారం గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో, మున్సిపల్ కమిషనర్లు, సిబ్బందితో ఓటర్ జాబితా తయారిపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట, కోదాడ, హుజూర్ నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరిమున్సిపాలిటీలలోని 141 వార్డులలో రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ జాబితాను రూపొందించి జనవరి 1 న వార్డుల వారీగా ప్రకటించటం జరిగిందని ఈ ముసాయిదా జాబితాపై ఇప్పటికే సోమవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి అభ్యంతరాలను స్వీకరించామని వచ్చినవి వచ్చినట్లుగా పరిష్కరించి ఈనెల 10వ తేదీన మున్సిపాలిటీలలో వార్డుల వారీగా తుది ఓటర్ జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఓటర్ జాబితాలో నమోదు అయ్యిని వసిస్తున్న చిరునామా ప్రకారం ఒకే కుటుంబంలోని సభ్యుల ఓట్లు అన్ని ఒకే వార్డులో వచ్చే విధంగా, ఓటర్ జాబితాలో వార్డుల విభజన, మ్యాపింగ్ లాంటివి వార్డ్ స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సజావుగా రూపొందిస్తే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అస్కారం ఉంటుందని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారుఅదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ 1 అక్టోబర్ 2025 నాటి ఓటర్ జాబితాను ఆధారంగా చేసుకొని ముసాయిదా ఓటర్ జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించటం జరిగిందని వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి సక్రమంగా ఓటర్ జాబితా తయారు చేయాలని ఆదేశించారు. ఏ.ఎస్.డి (ఆబ్సెంట్, షిఫ్టింగ్, డెత్)జాబితాను తర్వాత అందజేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, బి జే పి ప్రతినిధి చల్లమల నరసింహ, హబీద్, బి ఆర్ ఎస్ ప్రతినిధి లవ కుశ సత్యనారాయణ సి పి ఎం ప్రతినిది గోపి సూర్యాపేట మున్సిపాల్టీ జాబితా పై అలాగే సైదా నాయక్ హుజూర్నగర్ మున్సిపాలిటీ ముసాయిదా ఓటర్ జాబితా పై పలు అభ్యంతరాలను కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కరించాలని కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశానికి బి జే పి నుండి హబీద్, సి హెచ్ నరసింహ, కాంగ్రెస్ నుండి చకిలం రాజేశ్వరావు, సి పి ఐ నుండి బి వెంకటేశ్వర్లు, బి ఎస్ పి నుండి రాంబాబు, బి ఆర్ ఎస్ నుండి సవరాల సత్యనారాయణ, లవకుశ,,సి పి ఎం నుండి కోట గోపి, వై ఎస్ ఆర్ సి పి నుండి దేగల రమేష్, హుజూర్నగర్ నుండి గెల్లి రవి, సైదా నాయక్ మున్సిపల్ కమిషనర్లు హనుమంత రెడ్డి, రమాదేవి, శ్రీనివాస్ రెడ్డి అశోక్ రెడ్డి, మున్వర్ ఆలీ, సి సెక్షన్ సూపర్డెంట్ సంతోష్ కుమార్, డి టి వేణు, మున్సిపల్ సిబ్బంది హాజరైనారు.

# డాక్టర్లు, సిబ్బంది పెషెంట్లకు అందుబాటులో వుండాలి



## జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, మహా :** డాక్టర్లు, సిబ్బంది వచ్చే పేషెంట్లకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆసుపత్రిలోని వార్డులను కలియ తిరిగి ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది రోజు విధులకు హాజరు అవుతున్నారా లేదా అని హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరైన వారిపై చర్యలు తప్పవన్నారు. ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రికి ఏ చికిత్స కోసం వచ్చారని, వైద్యులు సమయానికి చికిత్స అందిస్తున్నారా? మందులు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి లో నార్మల్ డెలివరీ ఏమైనా అయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీలు పెంచాలన్నారు. అనంతరం ఆశ "డే" పురస్కరించుకుని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మీ పరిధిలో ఉన్న గర్భిణిలను రెగ్యులర్ గా వారి ఆరోగ్యం పై శ్రద్ధ చూపాలన్నారు, గర్భిణీలు రెగ్యులర్ గా చెకప్ కు వచ్చేలా చూడాలన్నారు. మొదటి నెల నుండే నార్మల్ డెలివరీ అయ్యే విధంగా గర్భిణి స్త్రీలను ప్రిపర్ చేయాలని, వారికి అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భరత్ చంద్ర కుటుంభానికి 200 గజాల ఇంటి స్థలం మంజూరు



## జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, మహా :** భరత్ చంద్రా చారి కుటుంబము నివసించడానికి ఇల్లు లేక పోవడం తో 200 గజాల చదరపు స్థలాన్ని మంజూరు చేసిన జిల్లా కలెక్టర్ హనుమంత రావు.... మంగళవారం సంస్థాన్ నారాయణపురం మండలం కంకణాల గూడెం గ్రామానికి చెందిన భరత్ చంద్రా చారిని దత్తత తీసుకున్న కలెక్టర్..ప్రతి నెల అతని చదువుకు ఆర్థిక భరోసాని ఇస్తూ వారి కుటుంబానికి నెలకు సరిపడా సరుకులను అందిస్తున్నారు. అందులో బాగంగా ఈ నెలకు సరిపడిన సరుకులు, ఆర్థిక సహాయం కింద 5000 రూపాయలు, దుప్పట్లు, మంచిగా చదువుకునేందుకు పుస్తకాలు అందజేశారు. భరతచంద్ర చారి కుటుంబం నివసించడానికి ఇల్లు సరిగా లేకపోవడం , వారు ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ కి చెప్పడంతో స్థానిక తహసీల్దార్ చెప్పి వారు ఉండటానికి ప్రభుత్వం తరుపున 200 గజాల స్థలాన్ని మంజూరు చేయించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు చేసి వారికి ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరగా భూమి పూజ కూడా చేయడం జరుగుతుందని హామీ ఇవ్వడం జరిగింది. మీ కుటుంబానికి అన్ని విధాలుగా నీకు ఏ సహాయం కావాలన్న చేస్తా అని హామీ ఇచ్చారు, నువ్వు చేయాల్సింది ఒక్కటే బాగా చదివి నువ్వు కోరుకున్న విధంగా ఎస్. ఐ కావాలని భరత్ చంద్ర చారి కి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




ANN తెలుగు
మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్
07-01-2025

పురపోరు 2026



## కొత్తగూడెం కార్పొరేషన్

# దశాబ్దాల కలకు రూపం

## పాలనలో కొత్త అధ్యాయం

**మహా ప్రత్యేకం, కొత్తగూడెం:** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపాలిటీ వ్యవస్థల బలోపేతం దిశగా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం ఏడుమాసాల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయంతో మున్సిపల్ కార్పొరేషన్ గా రూపాంతరం చెందింది. కొత్తగూడెం–పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయగా, ఫిబ్రవరిలో కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ కు తొలిసారి ఎన్నిక జరగనుంది. కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ కేవలం పరిపాలనా మార్పు మాత్రమే కాదు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి పటంలో కొత్త అధ్యాయానికి నాంది.

### 4 లక్షలకుపైగా జనాభా

కొత్త కార్పొరేషన్ ఏర్పాటుతో జనాభా, విస్తీర్ణం రెండింటిలోనూ భారీ మార్పు చోటు చేసుకుంది.

**డివిజన్లు - 60**

### కొత్త కొత్తగా..

ఇటీవల కార్పొరేషన్‌లుగా అప్‌గ్రేడ్ అయిన మహబూబ్‌నగర్, మంచిర్యాలతో కలిపి తెలంగాణలో కార్పొరేషన్‌ల సంఖ్య 9కు చేరగా, ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే నల్లగొండ కూడా అప్ గ్రేడ్ అయింది. ఈ అప్ గ్రేడ్ అయిన కార్పొరేషన్లకు ఫిబ్రవరిలోనే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి.



### పట్టణాలే అభివృద్ధి ఇంజిన్లు

జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెంను నగర పాలక సంస్థగా మార్చాలన్న డిమాండ్ ఎన్నాళ్లుగానో వినిపిస్తోంది. ఈ అంశాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పలు మార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మునిసిపల్ శాఖను కూడా తన వద్దే పెట్టుకున్న ముఖ్యమంత్రి వ్యూహాత్మకంగా పాల్వంచను కూడా కలిపి జంటపట్టణాలతో మెగా మునిసిపల్ కార్పొరేషన్ గా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

### పట్టణాభివృద్ధికి ఇదీ ప్రణాళిక

- మెరుగైన మౌలిక సదుపాయాలు
- సమగ్ర డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు
- ఆధునిక పౌర సేవలు.. ప్రణాళికాబద్ధమైన అర్బన్ గ్రోత్
- లక్ష్యంగా ఈ కార్పొరేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది దశాబ్దాల కల సాకారమైంది



## కార్పొరేషన్‌తో మారిన రాజకీయం

కొత్తగూడెం కార్పొరేషన్‌లో 60 డివిజన్లు ఏర్పాటు చేయడంతో పాత వార్డుల భౌగోళిక స్వరూపం పూర్తిగా మారిపోయింది. దశాబ్దాలుగా కోర్టు కేసుల కారణంగా ఎన్నికలు జరగని పాల్వంచ ప్రాంతం ఇప్పుడు కార్పొరేషన్‌లో భాగం కావడం రాజకీయంగా కీలక మలుపు. కార్పొరేషన్ ఏర్పాటుతో కొత్తగూడెం నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. మేయర్ పీఠం రిజర్వేషన్ ఏ వర్గానికి దక్కుతుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. అనేకమంది నేతలు తొలిసారి మేయర్ పీఠంపై కన్నేశారు.

**పొత్తుల సందిగ్ధత:**

కాంగ్రెస్ సింగిల్ గా సై..

అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి నడిచిన కాంగ్రెస్–సీపీఐ బంధం మున్సిపల్ ఎన్నికల వేళ వ్యూహాత్మకంగా కనబడుతోంది.

**కాంగ్రెస్ పార్టీ:**

ఈసారి ఒంటరిగా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. పొత్తులో భాగంగా కాంగ్రెస్ మేయర్, సీపీఐ డిప్యూటీ మేయర్ తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి.

**సీపీఐ:**

- తన ఉనికిని కాపాడుకునేందుకు కొత్త మార్గాల అన్వేషణ. మేయర్ పీఠంపై కన్ను
- బీఆర్ఎస్‌తో సీపీఐ నేతల మంతనాలపై జిల్లాలో హాట్ టాక్
- బీఆర్ఎస్‌తో పొత్తు కుదరకపోతే సీపీఎంతో కలిసి ఉమ్మడి వామపక్ష వేదికపై ఆలోచనలు
- మొత్తం మీద కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికలు జిల్లా రాజకీయాలకు దిశానిర్దేశకంగా మారనున్నాయి.

### అభివృద్ధి వర్సెస్ రాజకీయాలు

కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు పాలనకు కొత్త శక్తి. ప్రజలకు కొత్త ఆశలు. రాజకీయాలకు కొత్త లెక్కలు. అభివృద్ధి అజెండాను ప్రజలు ఎలా మదింపు చేస్తారు? పొత్తుల గందరగోళంలో ఎవరి వ్యూహం ఫలిస్తుంది? ఈ ప్రశ్నలకు రాబోయే కార్పొరేషన్ ఎన్నికలే సమాధానం చెప్పనున్నాయి. కొత్తగూడెం కేవలం జిల్లా కేంద్రం కాదు, రాజకీయ పరీక్షా క్షేత్రం. కొత్తగూడెం కార్పొరేషన్ లో తొలి మేయర్ పీఠం ఎవరిదో చూడాలి.

### ముఖ్యమంత్రి చూపు.. ముగ్గురు మంత్రుల ఇలాకా

ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకమైన రాజకీయ క్షేత్రం. ఈ జిల్లాలో ఇపుడు ఎన్నికలు జరిగే కార్పోరేషన్ ను కాంగ్రెస్ వదులుకునే అవకాశాలు ఏమాత్రం లేవు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పొంగులేటి, తుమ్మలలకు ఈ నియోజకవర్గం లో భారీ అనుచరగణం, అభిమానులు ఉన్నారు. కాంగ్రెస్ కు నియోజకవర్గంలో గట్టి పట్టు ఉంది.

# ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా --జి.కె.






**ఆమనగల్లు, మహా:** నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవాలాంధిస్తానని ఆమనగల్లు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. ఆమనగల్లు పట్టణ కేంద్రాల్లోని శుభం కన్వెక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన గుర్రం కేశవులు జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు.ఆమనగల్లు ముఖ ద్వారం నుండి అభిమానులు,నాయకులు బాణాసంచా, డిజె పాటల నృత్యాలు, భారీ గజమాలతో స్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించారు.జాతీయ రహదారి మొత్తం జన్మ దిన వేడుకల ఆనందోస్తాహలతో నిండిపోయింది. బాణాసంచా కాలుస్తూ యువకులు, మహిళలు కోలా టలతో సంబరాలు జరుపుకున్నారు.గుర్రం కేశవులుకి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్చాలు, అందచేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులు,కార్యకర్తల కు తినిపించారు.అంతకుముందు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# ఓటరు జాబితా ఈనెల 10న వెలువడనుంది!

- రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు
- అధికారులు సమన్వయంతో జాబితా రెడీ చేయాలి
- పోలింగ్ కేంద్రాలలో అభ్యంతరాలు సూచించాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితాను ఈ నెల 10న వెలువరించ డం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె. శ్రీనివాస్ అధ్యక్షతన, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వ హించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్ట ర్ మాట్లాడుతూ... రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని అన్నారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట జనవరి 10వ తుది జాబితా వెలువరిస్తామని సూచించారు. మున్సి పల్ స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితా తయారీలో బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఎలు సమ న్వయంతో పనిచేసి జాబితాను తయారు చేయాలని, వివాహాలు చేసుకొని వెళ్ళిన వారి పేర్లు, ఇండ్లు మరిన వారి పేర్లు, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని, ఓటర్ జాబితాలో తప్పులు దొర్లకుండా క్షుణ్ణంగా పరిశీలించి ఫైనల్ గా ఓటర్ జాబితాను తయారు చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిషనల్ కలెక్టర్ ను కోరగా అందుకు అడిషనల్ కలెక్టర్ స్పం దిస్తూ ఓటర్ జాబితా తయారీలో ఎలాంటి పొరపా ట్లు జరగకుండా ఫైనల్ జాబితా తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, పిడి మెప్మా వెంకట సత్యనారా యణ, బిఆర్ఎస్ నాయకులు మదుపు వేణుగోపాల్, నిట్టూ జగదీశ్వర్, బి.శ్రవణ్, సి.హెచ్.దేవదాస్, బిజెపి నాయకులు ఎన్.మల్లారెడ్డి, మల్లేశ్ యాదవ్, వై.నా రాయణ యాదవ్, లక్ష్మీపతి గౌడ్, టిడిపి నాయకులు జెలమోని రవీందర్, సంబంధిత అధికారులు, తదిత రులు పాల్గొన్నారు.

# నార్సింగి సర్కిల్ 45లో స్పెషల్ డ్రైవ్ శానిటేషన్ కార్యక్రమం




**గండిపేట,మహా:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మరియు డిప్యూటీ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, నార్సింగి సర్కిల్ 45 పరిధిలో మంగళవారం సానిటేషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరాం ఆధ్వర్యంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ను నిర్వహించారు. ఈ సందర్భంగా నార్సింగి సర్కి ల్‌లోని ప్రధాన చెత్త పాయింట్ల వద్ద పూర్తిగా చెత్తను తొలగించి ఆ ప్రదేశాల్లో తిరిగి వ్యర్థాలు వేయకుండా ఆ ప్రాంతంలో ముగ్గులు మరియు మొక్కలు నాటా మన్నారు. అంటే కాకుండా ప్రజలు పరిసరాల పరి శుభ్రత పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, రోడ్ల పక్కన చెత్త వేయకుండా సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.నార్సింగి సర్కిల్ ను శుభ్రతలో అన్ని విధాలుగా పరిశుభ్రంగా ఉంచటానికి నిరంతరం కృషి చేస్తామన్నారు.కార్యక్రమంలో డిఈ ఎస్ డబ్ల్యూఎం నరేష్, ఏఈ డబ్ల్యూఎం సంతోష్, శాని టేషన్ సిబ్బంది జవాన్ లు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై కట్టుబడి పనిచేస్తా.... ఖదీర్

## మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



**ఆమనగల్లు, మహా:** మాడ్గుల మండలం గిరికొత్తపల్లి గ్రామానికి చెందిన యండి ఖదీర్ ఉపసర్పంచ్ గా ఎన్ని కైన సందర్భంగా మంగళవారం రహమంతపూర్లోని హాజ్రత్ శిరీన్ షావలి దర్గా షరీఫ్ వద్ద మైనార్టీ నాయ కులతో కలిసి ప్రత్యేక చాదర్ సమర్పించి ఫాతేహాలు, దువా కార్యక్రమం చేపట్టారు. ఉప సర్పంచ్ గా ఎన్నికై నా సందర్భంగా మాడ్గుల మైనార్టీ నాయకులు సలీమ్ ఆధ్వర్యంలో మహ్మద్ ఖదీర్ ను శాలువాలు, పూలమా లలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ఖదీర్ మాట్లాడుతూ.. గిరికొత్తపల్లి గ్రామ అభి వృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కట్టుబడి పని చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఖాసీం, జహంగీర్, షరీన్ బాబా, హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదంలో రెండు గడ్డివాములు దగ్ధం



**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు ని ప్పంటుకొని రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. తండాకు చెందిన నేనావత్ సోమ్లు, నేనావత్ మల్య నాయక్ తమ వ్యవసాయపొలంలో పశువుల కోసం నిలువ చేసిన గడ్డి వాములు ప్రమాదంలో పూర్తిగా కాలి పోయినట్లు చెప్పారు.కాలిపోయిన గడ్డివాముల విలువ రూ.60 వేలు ఉంటుందని వివరించారు. పేద కుటుంబాలకు చెందిన తమను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు.

**రైతులను పరామర్శించిన కండె హరి ప్రసాద్..**

ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండా పొలంలో గడ్డి దగ్ధం కాగా పూర్తిగా కాలిపోయిన విషయం తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి కండే హరిప్రసాద్ రైతులను పరామర్శించారు. ప్ర భుత్వం స్పందించి రైతులకి న్యాయం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షులు కర్నాటి విక్రమ్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నరసిం హ,మాజీ కౌన్సిలర్ చెన్నకేశవులు,పార్లమెంట్ బీజేవైఎం కోకన్వీనర్ రవి రాథోడ్ , రంగారెడ్డి జిల్లా బిజెపి పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ నందు రాథోడ్ పాల్గొన్నారు.


# విద్యార్థులు ప్రశ్నించడం నేర్చుకోవాలి

## జ్ఞాన విజ్ఞాన వేదిక మాజీ అధ్యక్షులు ఎన్ఐటీ ప్రొఫెసర్ రామచంద్రయ్య




**మొయినాబాద్ మహా:** చిలుకూరు గురుకులంలో జన విజ్ఞాన ఐక్యవేదిక అవగాహన సదస్సు నిర్వహించా రు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చిలుకూరులో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో జ్ఞాన విజ్ఞాన వేదిక మాజీ అధ్యక్షులు ఎన్ఐటీ ప్రొఫెసర్ రామచంద్రయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు మహా విస్ఫోటం, విశ్వం పుట్టుక, విస్తరణ, నక్షత్రాలు, గెలాక్సీలు వంటి ఆసక్తికర విషయాలు విపులంగా వివరించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, వి ద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రశ్నించడం నేర్చుకోవాలని ప్రశ్నించడం నేర్చుకున్న ప్పుడే దేశం అభివృద్ధి బాటలో ఉన్నట్లని అన్ని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు కూడా సమాధానాలు తెలి యకపోతే తెలుసుకొని చెప్పాలి తప్ప దాటవేసే పని చేయవద్దని సూచించారు. మన పెద్దలు అయితే తమ పిల్లలు అడిగే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అలా అడగొద్దు రా కళ్ళు పోతాయి అని చెబుతూ ప్రశ్న పుట్టుకని ఆపేసే ప్రయత్నం చేస్తారని, అలా చేయవ ద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు రాష్ట్ర కమిటీ సభ్యులు డి.సత్యం, కళాశాల ప్రిన్సిపల్, దేవేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శౌరి, చిలుకూరు పేరెంట్స్ కమిటీ చైర్మన్ బేగరి రాజు అధ్యాపకులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యా ర్థులు పాల్గొన్నారు.

# కంది శ్రీనివాస రెడ్డి కృషితో కీలక దశకు భూకేటాయింపు


JUPALLY KRISHNA RAO
Minister for Prohibition & Excise, Tourism, Culture and Archaeology

Room No. 13 to 16, 4th Floor, Dr. B.R. Ambedkar, Telangana State Secretariat, Hyderabad-500 004
Ph: 040-2345 0368
Mobile: 98480 14089, 94406 17267
E-Mail : peshi-min-petca@telangana.gov.in

Lr.No. 2521/RB/Min(P&E,T,C&A)/2025, Dt.22.07.2025

Dear Ponguleti Srinivas Reddy Garu,

I would like to enclose a letter from Sri Kalla Vittal, President Munnurukapu Sangam, Adilabad regarding allotment of Government Land to an extent of 2.00 Acres identified in Sy. No. 72 of Battisavergaon village of Mavala Mandal of Adilabad district for construction of Munnurukapu Boys & Girls Hostel at Adilabad.


Further the District Collector, Adilabad while enclosing the land identification report along with location sketch has requested the Government for issuing necessary instructions on alienation of 2.00 Acres of Government land in Sy. No. 72, Battisavergaon Village of Mavala Mandal, Adilabad district for construction of Munnurukapu Boys & Girls Hostel at Adilabad.

In view of the above, I request you to expedite the matter personally and issue necessary instructions to the concerned at the earliest possible.

With best regards,

(JUPALLY KRISHNA RAO)
Incharge Minister Erstwhile Adilabad Dist

To
Ponguleti Srinivas Reddy Garu,
Hon'ble Minister for Revenue and Housing,


TELANGANA PRADESH CONGRESS COMMITTEE
GANDHI BHAVAN, HYDERABAD-500001, Phone: 040-24603718, 040-24602484, Fax: 040-24602383
Cell: 94994 49999

Kandi Srinivasa Reddy, B.Tech, MBA, MS (USA)
MLA Contested
Incharge, Adilabad Assembly Constituency

Lr.No.KSR/1501/2024 Dt: 18-07-2024.

To
Sri Jupally Krishna Rao Garu,
Hon'ble Minister for Prohibition & Excise, Tourism and Culture and Archaeology,
Govt. Of Telangana, Hyderabad.

Respected Sir,

Sub : Request for Alienation of Govt. Land extent of 2.00 Acres in Sy. No. 72 of Battisawargaon (V) of Mavala Mandal, District Adilabad for C/o Hostel for Munnurukapu Boys & Girls Hostel - Proposals submitted to the Govt. - Request for allotment of Land and issue of necessary orders - Reg.

Ref : 1.Government Memo No.6712/Land Admin.I(I)/2024-1, Dated:06.04.2024.
2.Representation of Sri.Kalla Vittal, President Munnuru kapu Sangam, Adilabad Dt:30.10.2024.
3.Tahsildar, Mavala Lr. No. B/1761/2016, Dt; 11.11.2024.
4.Re.No. E1/1194/2024, Dated:17.11.2024 of the District Collector, Adilabad submitted to the Additional Secretary to Government, Revenue (Land Administration.1) Department, Telangana, Hyderabad.

*****

I submit that through the above cited 4th reference, the alienation proposals for allotment of 2.00 Acres Government Land in Sy. No. 72 of Battisawargaon (V) of Mavala Mandal District Adilabad for C/o Munnurukapu Boys & Girls Hostel at Adilabad has been submitted to the Government. The District Body of Munnurukapu Sangham is requesting for allotment of land for the benefit of Students at an early.



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా మున్నూకాపు బాల బాలికల వసతి గృహాల కోసం రెండు ఎకరాల భూమిని కేటాయించాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు చేసిన వినతితో భూకే టాయింపుకు ముందడుగు పడింది. ఇదే విషయమై మంత్రి జూపల్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి సిఫారసు చేసారు..దీంతో రెవెన్యూ శాఖ భూ పరిపాలన విభాగం సంబంధిత ఉత్తర్వులు జారీ చేయగా, జిల్లా యంత్రాంగం ద్వారా అవసరమైన నివేదికలు, భూమి గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యాయి. ప్రస్తుతం ఈ ప్రతిపాదన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ తుది ఆమోదం పొంది త్వరలో కేటాయింపు జరగ నుంది. దీని వెనుక కంది శ్రీనివాస రెడ్డి చేసిన కృషిని పలువురు అభినందిస్తున్నారు.



# పూర్తి పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించాలి

## కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ మహా :** రాబోయే మున్సిపల్ ఎన్నిక లను దృష్టిలో ఉంచుకొని ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతం గా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధి కారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికలు, ఓటర్ల జాబితా సవరణ, అభ్యంతరాల పరిష్కారంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహ ణలో ఓటర్ల జాబితా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్ల కు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతిని ధులు, ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను క్షుణ్ణం గా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. జాబితా సవరణలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశం లో లేవనెత్తిన పలు సందేహాలకు కలెక్టర్ సమాధానా లు ఇస్తూ, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుం టామని అన్నారు. వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ల జాబితా ప్రదర్శన తదితర అంశాలపై మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, మున్సి పల్ కమిషనర్ రాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతిని ధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాగు ఉత్పత్తి పై రైతులకు అవగాహన ఉండాలి

## మంచిర్యాల జిల్లా సహకార అధికారి సత్యనారాయణ

**మంచిర్యాల, మహా :** వ్యవసాయంలో పంట సాగు ఉత్పత్తి నిర్వహణపై రైతులకు అవగాహన ఉండాలని మంచిర్యాల జిల్లా సహకార అధికారి సత్యనారాయణ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల కార్యకలా పాలపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి వరంగల్ కె.సి.టి.సి. ప్రిన్సిపల్ ఎల్ .యాకూబ్ నాయక్, ప్రధాన శిక్షణదారు భూసరపు శ్రీనివాస్ లతో కలిసి హాజర య్యారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణలో లర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టం, ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్, ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్, మార్కెట్ లింకేజ్, డిజిటల్ లిటరసీ, డ్రోన్ వ్యాపార కార్యకలాపాలపై శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానా న్ని వినియోగించుకుని పంట సాగులో అధిక ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. అధికారిక పర్సన్ ఇంచార్జ్ లు, ఎఫ్ పి ఓ ల సి ఈ ఓ లు, అకౌంటెం ట్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఓటరు జాబితాపై కలెక్టర్ సమీక్ష



**నిర్మల్ మహా:** మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాపై ఉన్న అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మం గళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ వేరు వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఓటరు జాబితా తయారీ, అభ్యంతరాల స్వీకరణ, తుది జాబితా ప్రచురణ ప్రక్రియపై వివ రించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా, లోపాలు లేకుండా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మున్సిపాలిటీల వారీగా ఇప్పటివరకు ముసాయిదా ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను సమీక్షిం చి, వాటిని నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే ఈ నెల 9వ తేదీ వరకు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు లేదా జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందజేయా లని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. అందిన ఫిర్యాదులను వార్డు అధికారులు, బీఎల్ఓ లు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10వ తేదీన మున్సి పాలిటీల పోలింగ్ స్టేషన్‌ల వారీగా తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఎన్ని కల ప్రక్రియ సజావుగా సాగేందుకు, సమగ్ర ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతి నిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితా, మ్యాపింగ్, వలస ఓటర్లు, చిరునామాలు తదితర అంశాలపై తమ అభ్యంతరాలు, సందేహా లను వ్యక్తం చేయగా అధికారులు వాటిని నివృత్తి చేశారు. ఫిర్యాదులకు సంబంధించి పూరించాల్సిన వివిధ ఎన్నికల ఫారములపై వివరించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు

# రోడ్డు భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మందమర్రి, మహా :** రోడ్డు భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి టోల్ ప్లాజా వద్ద 37 వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు 2026 పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో బెల్లంపల్లి ఎ.సి.పి. రవికుమార్, జాతీయ రహదారుల సంస్థ జి.ఎం. (టి)టి పి.డి. కె.ఎన్. అజయ్ మణికుమార్ లతో కలిసి వాహనదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని, సు రక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా యువత మరణానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణంగా తెలుస్తుందని అన్నారు. వాహనా న్ని వేగంగా నడపడం, పరిమితికి మించి లోడ్ తో ప్ర యాణించడం కారణంగా వాహనాలు అదుపు తప్పు తాయని వెల్లడించారు. తద్వారా ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవా రు సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణించడం, జాతీయ రహదారిపై వాహనాలను నిలుపుదల చేయడం, పశువులను రహదారిపైకి వదలడం చేయవద్దని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించితే ప్రమాదాలను నియం త్రించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ రహదారుల సిబ్బంది రహదారి నియమ, నిబంధ నలను పాటించేలా వాహనదారులకు అవగాహన కల్పించాలని, రహదారులపై పని చేసే సిబ్బంది సైతం పని చేసే సమయంలో సేఫ్టీ కిట్స్ ధరించాల ని చెప్పారు. ప్రతి ఒక్కరూ సరైన కండిషన్ లో ఉన్న వాహనాన్ని మాత్రమే ఉపయోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ లో మాట్లాడవద్దని, ట్రాఫిక్ భద్రత నియ మాలను పాటించాలని సూచనలు చేశారు. జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు విస్తృత స్థాయిలో తనిఖీలు చేపడుతున్నామని, రహదారులపై వేగ నియంత్రణ కొరకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాహన దారులకు తెలిసే విధంగా సూచికలు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మకు అక్షరమాల విద్యాభివృద్ధి చర్యలు


## డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వం చేపట్టిన అమ్మకు అక్షరమాల ద్వారా వయోజన విద్య అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా డిప్యూటీ ట్రైనీ కలె క్టర్ మహమ్మద్ విలాయత్ అలీ అన్నారు. జిల్లాలోని దండేపల్లి మండలం గుడిరేవు గ్రామంలో గల ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రాలను జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, మండల ప్రత్యేక అధికారి చాత రాజుల దుర్గాప్రసాద్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భం గా డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాలు దిద్ది చదువు నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదని, 15 నుండి 60 సంవత్సరాల లోపు వారందరూ చదువుకోవాలని, అప్పుడే సమాజంలో గౌరవ స్థానం లభిస్తుందని అన్నారు. జిల్లా వయోజన విద్యాధికారి మాట్లాడుతూ ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రాలకు నిరక్ష రాస్యులు ప్రతి ఒక్కరు రావడమే కాకుండా చదువు నేర్చుకుని 100 రోజుల్లో అక్షరాస్యులుగా తయారు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త, ప్రధానోపాధ్యాయుడు బుచ్చన్న, జిల్లా విద్య క్వాలిటీ ఎడ్యుకేషన్ అధికారి సత్యనారాయణమూర్తి, ఎం ఆర్ పి జనార్ధన్ తదితరు లు పాల్గొన్నారు.

# కాకతీయ టెక్నో పాఠశాలను సీజ్ చేయాలి

## జేవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ ఫిర్యాదు



**మందమర్రి, మహా :** ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న కాకతీయ టెక్నో పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జేవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ ఫిర్యాదు చేసినట్లు వెల్లడిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మం చిర్యాల జిల్లా మందమర్రి మండలంలో ప్రభుత్వ నిబంధలనుకు విరుద్ధంగా కాకతీయ టెక్నో పేరుతో కొనసాగుతుంది తెలిపారు. పాఠశాల ఏర్పాటు చేసిన యాజమాన్యం అమాయకులైన విద్యార్థుల తల్లితండ్రులకు మాయమాటలు చెపుతూ అడ్మిషన్లు చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించకుండానే ఓపి పరిమిషన్లు తీసుకున్నారని ఆరోపించారు. కనీసం పిల్లలు ఆడుకో డానికి కనీసం గ్రౌండ్, సరైన తరగతి గదులు కూడా లేవని,ఏదైనా జరగరానిది జరిగితే దాని నివారించడా నికి అగ్నిమాపక యంత్రాలు కూడా లేవని వెల్లడించా రు. ఇవే కాకుండా పాఠశాలలో మరెన్నో సమస్యలు ఉన్నాయని స్పష్టం చేశారు. తక్షణమే సంబంధిత అధి కారులు స్పందించి కాకతీయ టెక్నో పాఠశాలను సీజ్ చేసి, యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు మరల పునరావృతం కాకుండా చూడగలరని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు పేర్కొన్నట్లు వెల్లడించారు.

మహా పత్రిక 06
తెలుగు
బుధవారం, హైదరాబాద్ | 07-01-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM

# ఎస్సీ విభాగం చైర్‌పర్సన్‌గా డా.కవ్వంపల్లి సత్యనారాయణ నియామకం

**ఏఐసీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన డా. సత్యనారాయణ**



**కరీంనగర్ మహా :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం చైర్‌పర్సన్‌గా కరీంనగర్ జిల్లా మానకొండూర్ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణను గౌరవ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు నియమిస్తూ ఆమోదం తెలిపారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ వెల్లడించింది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, ఎంపీ కే.సి. వేణుగోపాల్ అధికారిక ప్రెస్ రిలీజ్ జారీ చేశారు. ఈ నియామకంపై డా. కవ్వంపల్లి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన గౌరవ ఏఐసీసీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, టీపీసీసీ పరిధిలో ఏఐసీసీ ప్రతినిధిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల హక్కులు అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన, మద్దతు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ డా. కవ్వంపల్లి సత్యనారాయణ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ నియామకంతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం మరింత బలపడుతుందని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి.



Phone (O) : 011-23019320
011-23019080
E-mail : kcvenugopal.org@gmail.com
kcvenugopal.in@gmail.com
Website : www.inc.in

ALL INDIA CONGRESS COMMITTEE

K.C. VENUGOPAL, M.P.
General Secretary

24, AKBAR ROAD,
NEW DELHI-110 011

January 6, 2026

PRESS RELEASE

Hon'ble Congress President has approved the proposal for the appointment of Dr. Kavvampally Satyanarayana as the Chairperson of SC Department, Telangana Pradesh Congress Committee, with immediate effect.

(K. C. Venugopal)

# జనవరి 18 సభను విజయవంతం చేయాలి



**మంచిర్యాల, మహా :** ఖమ్మం జిల్లాలో జనవరి 18న తలపెట్టిన భారత కమ్యూనిస్టు పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మంచిర్యాల జిల్లా ప్రచార బస్సు జాత 4 వ రోజు లక్షెట్టి పేట మండలం దౌడపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సంబంధాన్ని పురస్కరించుకొని లక్షెట్టిపేట సిపిఐ కార్యదర్శి మేదరి దేవవరం, దౌడపల్లి గ్రామపంచాయతీ ఉప ఉప సర్పంచ్ సంతపురి మధు, వార్డు సభ్యులు దుర్గం దేవదాస్, విజయలక్ష్మి దేవేంద్ర, కంది సత్యం, రాజ్ దాస్ లతో కలిసి బస్సు జాతకు స్వాగతం పలికారు. అనంతరం అరుణ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 18 న ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన 100 సంవత్సరాలు సిపిఐ పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత వంద సంవత్సరాలుగా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కొరకు కమ్యూనిస్టు పార్టీ ఎనలేని పోరాటాలు చేస్తుందని చెప్పారు. ఈ పోరాటంలో చాలామంది ప్రాణత్యాగం చేశారని వివరించారు. ప్రజల కొరకు, ప్రజల హక్కుల సాధన కొరకు ప్రాణత్యాగం చేసిన అమరులకు విప్లవాది వందనాలు తెలిపారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


**సమ్మేళనంలో పాల్గొన్న ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ రాధ**



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని ఆర్యవైశ్య ఉన్నత పాఠశాల 1960 70 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం రామన్నపేటలోని వేడుకల మందిరంలో జరిగింది. దశాబ్దాల కాలం తర్వాత మిత్రులంతా ఒకచోట ఆత్మీయంగా కలుసుకొని బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ రాధ వృద్ధులు మానసిక ప్రశాంతత అనే అంశం పై కులంకుశంగా ప్రసంగించారు. వృద్ధులు మానసికంగా, దృఢంగా, ప్రశాంతంగా ఎలా ఉండాలో వివరించారు. అనంతరం విద్యార్థులు వారికి గురువులైన రామలింగం, బాలరాజు లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమ్మేళనంలో విద్యార్థులు మహాబలేశ్వర్, ఆనంద్, నాగేశ్వరరావు, లింగమూర్తి, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, సుధాకర్ ,గోపాల్ రావు, గోపీనాథ్, విశ్వేశ్వరరావు, నర్సింగం, నరసింహారావు, సుబ్రహ్మణ్యం, సంపత్ కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉర్సు ఉత్సవాలకు భద్రతా ఏర్పాట్లు

**పరిశీలించిన వరంగల్ ఏసీపీ శుభం నగ్రాలే**



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని ఉర్సు జాగీర్ లోని హజ్రత్ మషూక్‌ఎరబ్బానీ (రహ్) వారి దర్గా షరీఫ్‌ను ఏఎస్పీ శుభమ్ నగ్రాలే, ఐపీఎస్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాబోయే ఉర్సు ఉత్సవాలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను ఏఎస్పీ స్వయంగా పరిశీలించి, భద్రతా పరిపాలనా ఏర్పాట్లను గురించి నవీద్ బాబా సాహెబ్, ఉబైద్ బాబా సాహెబ్ లతో స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి పర్యవేక్షించారు. ఏఎస్పి వెంట మిల్స్ కాలనీ ఎస్సై సురేష్, సిబ్బంది, జమీల్, తదితరులు ఉన్నారు.





# ప్రతి విద్యార్థి ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

**మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి.. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హన్మకొండ మహా;** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రతి విద్యార్థి ఆంగ్ల భాష పై పట్టు సాధించే విధంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ఆదేశించారు. మంగళవారం హనుమకొండ వడ్డేపల్లి లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఇంగ్లీష్ ఎన్రిచ్మెంట్ ప్రోగ్రాం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆంగ్ల, తెలుగు, హిందీ భాషలో విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఆంగ్ల భాషలో ఆశించిన స్థాయిలో ప్రావీణ్యం చూపకపోవడంతో కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆంగ్ల భాష బోధనను మరింత ప్రభావవంతంగా నిర్వహించాలని, విద్యార్థుల చదువు నైపుణ్యాలను మెరుగుపరచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులతో ఇంగ్లీషులోనే మాట్లాడాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, వంటగదిని కలెక్టర్ పరిశీలించారు. భోజన పదార్థాలను తనిఖీ చేశారు. మెనూను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజు గౌడ్, ఎంఈఓ నెహ్రూ, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్ ఉన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రులకు అనుమతులు తప్పనిసరి



- **నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు**
- **డిఎంహెచ్ఓ డాక్టర్ బి సాంబశివరావు**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మంగళవారం నెక్కొండ పట్టణం లోని ఉపేందర్ ప్రైవేట్ ఆసుపత్రిని మంగళవారం తనిఖీ చేసి హాస్పిటల్ లో గల వసతులు వారు అందిస్తున్న సేవల పై ఆరా తీసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ లేకుండా ఆసుపత్రి నిర్వహించడం అలాగే యజమాన్యం వివిధ రకాల సేవలు అందిస్తున్న ఆసుపత్రి యాజమాన్యం పై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రుల లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ జరుగుతున్నట్లు భ్రూణహత్యలు చేస్తున్నట్లు పత్రికలలో ప్రచారం జరుగుతున్నదని అలాంటి ప్రైవేటు ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పి సి పి ఎన్ డి టి ఆక్ట్ ప్రకారం ముందుగా పర్మిషన్ తీసుకొని దానికి సంబంధించిన గైనకాలజిస్ట్ రేడియాలజిస్టు లు మాత్రమే గర్భములో ఉన్న పిండం యొక్క స్థితిని తెలుసు కోవడానికి, సమస్యలను పరిష్కరించాలని గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసి భృణహత్యలు చేసినట్లయితే వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ కొరకు ఎవరూ ప్రోత్సహించిన తల్లిదండ్రులు అంగీకరించిన పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు శిక్షకు అర్హులని, వారిపైన కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి పోలీస్ శాఖను రెవెన్యూ శాఖను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. నెక్కొండ పట్టణంలో వరంగల్ జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రి నిర్వహిస్తున్న యజమాన్యం ముందుగా పర్మిషన్ తీసుకొని క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారం ఎస్టాబ్లిష్ చేసి సేవలందించాలని జిల్లా వైద్య అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్‌కు సంతాపం

**సంతాప సమావేశంలో పాల్గొన్న జర్నలిస్ట్ ప్రతినిధులు**



**హన్మకొండ మహా;** పత్రికా రంగంలో మఫిషియల్ ఎడిటర్ గా, అసిస్టెంట్ ఎడిటర్ గా విశిష్ట సేవలందించి గ్రామీణ జర్నలిజానికి ప్రాణం పోసిన సీనియర్ జర్నలిస్ట్ టి.కె లక్ష్మణ్ రావు మృతి పట్ల ఉమ్మడి వరంగల్ జిల్లా జర్నలిస్ట్ లు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ లో జర్నలిస్ట్ లక్ష్మణ్ రావు వెల్ విషర్స్ సర్కిల్ నేతృత్వంలో జరిగిన సంతాప సమావేశానికి యూనియన్ లకు అతీతంగా డెస్క్ జర్నలిస్ట్ లు, వివిధ ఛానల్స్, పత్రికల స్టాఫ్ రిపోర్ట్ లు, ఫొటో జర్నలిస్ట్ లు, గ్రామీణ విలేకరులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సీనియర్ జర్నలిస్ట్ లు టీయూ డబ్ల్యూజె డెస్క్ జర్నలిస్ట్ ల ఫోరం స్టేట్ కన్వీనర్ శెంకేసి శంకర్ రావు, డెస్క్ జర్నలిస్ట్ ల ఫోరం రాష్ట్ర నాయకులు వర్దెల్లి లింగయ్య, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, టీయూడబ్ల్యూజె ఐజేయూ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు గోకారపు శ్యాం, సీనియర్ జర్నలిస్ట్ కెంచ కుమారస్వామి (కేకే) పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ టి.కె. లక్ష్మణ్ రావు వృత్తిపరమైన అంకిత భావం, ప్రత్యేకించి గ్రామీణ జర్నలిస్ట్ లు, జర్నలిజం పట్ల ఆయనకున్న మక్కువ వారిని ప్రోత్సహించిన తీరును సంతాప సమావేశంలో కొనియాడారు. మానవీయ కథనాలతో గ్రామీణ ప్రజల జీవితాలను తెరచి చూసిన జర్నలిస్ట్ గా, తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల జీవితాలు ప్రతిబింబించే అనేక కథనాలకు సంచలనాత్మక శీర్షికలను అందించిన జర్నలిస్ట్ గా లక్ష్మణ్ రావుది విశిష్టమైన పాత్ర అని అన్నారు. ఎంతో మందికి గ్రామీణ జర్నలిస్ట్ లుగా, స్టాఫ్ రిపోర్ట్ లుగా, సబ్ ఎడిటర్లుగా వివిధ పత్రికల్లో అవకాశాలు కల్పించేందుకు తోడ్పడిన 'ఓ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్' అని కీర్తించారు. లక్ష్మణ్ రావు మరణం గ్రామీణ జర్నలిజానికి తీరని లోటని, ఆయన ఆశయ సాధనకు పాల్పడటమే లక్ష్యంగా పనిచేస్తే ఆలోటును తీర్చగలమని అన్నారు. ఉదయం, వార్త, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, సాక్షి లాంటి పత్రికల్లో వివిధ హోదాల్లో పని చేసిన లక్ష్మణ్ రావు తరతమ భేదం లేకుండా అందరితో కలివిడిగా, తలలో నాలుకలా ఉండేవారని అన్నారు. లక్ష్మణ్ రావు వివిధ హోదాల్లో పని చేసినా అత్యంత సాదాసీదాగా ఉండటం, నిరాడబరంగా జీవించి జర్నలిస్ట్ లందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ సంతాప సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ లు ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరీస్ వలిశెట్టి సుధాకర్, పొడిశెట్టి విష్ణువర్ధన్, ప్రెస్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నయీంపాష, ప్రెస్ క్లబ్ మాజీ కార్యదర్శి పవన్ కుమార్, డెస్క్ జర్నలిస్ట్ లు నాగరాజు, వనం శ్రీకాంత్, రాజు, కిరణ్, ఫొటో అండ్ వీడియో జర్నలిస్ట్ నాయకులు గొట్టె వెంకన్న, తిరుమల్, ప్రదీప్, వివిధ పత్రికల జర్నలిస్ట్ లు విజయ భాస్కర్, రజాక్, నర్సయ్య, జన్ను రవి, రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించడం మనందరి బాధ్యత

**పోచమ్మ మైదాన్ లో భద్రత అవగాహన సదస్సు ర్యాలీ**

**పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి బి నిర్మలా గీతాంబ, సెంట్రల్ జోన్ డిసిపి, ఏఎస్పి**







**వరంగల్ మహా;** రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా మంగళవారం వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ పోలీసు అధికారుల సమన్వయంతో పోచమ్మ మైదాన్ కూడలిలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ హాజరయ్యారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యం.సాయికుమార్, సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత, ఏఎస్పి శుభం, ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ, వరంగల్ భారత్ అసియేషన్ ప్రెసిడెంట్ వలస.సుధీర్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సుజాత, మట్వాడ ఇన్స్పెక్టర్ కరుణాకర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టీ.జయపాల్ రెడ్డి మరియు సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ మాట్లాడుతూ రోడ్డు భద్రత పై అవగాహన అత్యంత ముఖ్యమైన అంశం అని పేర్కొన్నారు. జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను నాశనం చేస్తున్న విషాద కథలుగా మారుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ముఖ్యంగా అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం ఇవన్నీ ట్రాఫిక్ ఉల్లంఘనలుగా వారు పేర్కొన్నారు. ఒక్క క్షణం నిర్లక్ష్యం ఒక ప్రాణాన్ని తీస్తుందని అందుచేత ప్రతి ఒక్కరు వారి కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని వాహనదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు నియమాలు మీ ప్రాణాలను, మీ కుటుంబాల భవిష్యత్తును కాపాడేందుకు రూపొందించ బడ్డాయని ట్రాఫిక్నియమాలు పాటించడం మనందరి బాధ్యత అని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం మనందరి సామూహిక బాధ్యతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి ధార కవిత మాట్లాడుతూ అతివేగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం చిన్న తప్పులు కావు, ప్రాణాంతక తప్పులుగా సూచించారు. రోడ్డు నియమాలు తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారు ప్రచురించిన ట్రాఫిక్ నియమాల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం సుమారు 200 మంది విద్యార్థులచే ప్లకార్డులతో, నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, వాహనదారులతో ట్రాఫిక్ నియమాలు పాటించేలా ప్రతిజ్ఞ చేపించారు. కూడలి వద్ద న్యాయమూర్తులు, పోలీసు అధికారులు హెల్మెట్ ధరించిన వాహనదారులకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

# స్కానింగ్ సెంటర్ లపై నిఘా ఉంచాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**హన్మకొండ మహా;** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించకుండ ఉండేందుకు స్కానింగ్ సెంటర్ లపై పటిష్ట నిఘా ఉంచటంతో పాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలు లో పి సి పి ఎన్ డి టి (గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం) జిల్లా మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సమావేశంలో జిల్లాలో ఈ సంవత్సరం జరిగిన జననాలలో లింగ నిష్పత్తి ఎలా ఉంది ,అమ్మాయిల సంఖ్య ఏ మండలాల్లో తక్కువగా ఉందనే అంశాలపై సమీక్షించడం జరిగింది. వెయ్యి మంది బాలురులకు 925 మంది బాలికలు ఉన్నారని తెలుపగా అందుకు కారణాలను విశ్లేషించాలని, వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ, పోలీస్ శాఖలు దానికి అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. అలాగే అనుమానిత స్కానింగ్ సెంటర్ లపై పటిష్టమైన నిఘా ఉంచడమే కాకుండా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని ఆదేశించారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ ద్వారా మెడికల్ షాపులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎంటీపీ కిట్ ల అమ్మకానికి సంబంధించిన రికార్డులను, డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లను పరిశీలించాలన్నారు. ముఖ్యంగా ఏఎన్ఎంలు, ఆశా లు, అంగన్వాడి కార్యకర్తలు అప్పటికే ఆడ పిల్లను కలిగి ఉన్న గర్భిణీ స్త్రీలను, అలాగే మొదటి త్రైమాసికంలో నమోదు చేసుకున్న గర్భిణీ స్త్రీలను ఫాలోఅప్ చేయాలన్నారు. రేడియాలజిస్టులకు, గైనకాలజిస్ట్ లకు వర్క్ షాప్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన మాట్లాడుతూ సురక్షితం కాని పద్ధతిలో గర్భస్రావాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించాలని, అలాగే పోక్సో కేసులలో బాధిత అమ్మాయిలను వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఫాలో అప్ చేయాలన్నారు. అనంతరం డిఎంహెచ్వో డాక్టర్ ఎ.అప్పయ్య మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన లేదా చట్ట వ్యతిరేకంగా అబార్షన్లు నిర్వహించినా 6300030940 నెంబర్ కు తెలియజేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఈ.వి. శ్రీనివాసరావు, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి జయంతి, మాతా శిశు సంక్షేమం ప్రోగ్రాం అధికారి డాక్టర్ రుబీనా, డాక్టర్ నవీన్,డెమో వి అశోక్ రెడ్డి, ఎస్ వో ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.



# ఈసారి కేంద్ర బడ్జెట్‌పై తీవ్ర గందరగోళం!

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీల ప్రకటన నేపథ్యంతో ఆసక్తికర చర్చ మొదలైంది. ఆనవాయితీ ప్రకారం.. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టాలి. అయితే ఈసారి ఆదివారం కావడంతో ఆ తేదీ మారవచ్చనే ఊహాగానాలు మొదలయ్యాయి. దేశవ్యాప్తంగా యూనియన్ బడ్జెట్ 2026 ప్రవేశపెట్టే తేదీపై ఆసక్తి నెలకొంది. 2017 నుంచి ప్రతి ఏటా ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెడుతోంది కేంద్రం. కానీ, ఈసారి ఒకటో తేదీ ఆదివారం వచ్చింది. సాధారణంగా వారాంతాల్లో పార్లమెంట్ సమావేశాలే జరగవు. బ్రిటీష్ కాలం నుంచే ఆదివారాలను తప్పించాలనే ఆచారం కొనసాగేది. అలాంటిది.. అందునా ఆదివారం నాడు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఫిబ్రవరి 1నే కొనసాగిస్తారా? లేదంటే ఫిబ్రవరి 2 (సోమవారం)కి మార్చుతారా? అంటూ చర్చ మొదలైంది. అయితే.. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాత్రం.. తుది నిర్ణయం కేబినెట్ కమిటీ ఆన్ పార్లమెంటరీ అఫైర్స్ తీసుకుంటుందని చెబుతున్నారు. దీంతో.. ఆదివారం నిర్వహించడంపై సందేహాలు కొనసాగుతున్నాయి. అలాగని వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్త విషయమేమీ కాదు. 2025లోనూ శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. గతంలో.. అరుణ్ జైట్లీ ఫైనాన్స్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు 2015లో శనివారం, 2016లో ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. 2020లో కోవిడ్ సమయంలో.. అలాగే 2012 మే 13వ తేదీన 60వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పార్లమెంట్ సమావేశమైంది కూడా. దీంతో ఈసారి కూడా ఆదివారమే బడ్జెట్ ప్రవేశపెట్టే అస్కారం లేకపోలేదు.

### ఫిబ్రవరి 1నే ఎందుకంటే..


2017 ఏడాదికి ముందు బడ్జెట్ ఫిబ్రవరి చివరి రోజున ప్రవేశపెట్టబడేది. అయితే.. బడ్జెట్ ప్రవేశపెట్టాక మొదటి త్రైమాసిక ఖర్చుల కోసం 'వోట్ ఆన్ అకౌంట్' ఆమోదం తీసుకోవాల్సి వచ్చేది. తర్వాత విభాగాల వారీగా డిమాండ్లను పరిశీలించి పూర్తి బడ్జెట్ ఆమోదించబడేది.ఈ ఆలస్యాన్ని నివారించేందుకు 2017లో అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీంతో ఏప్రిల్ 1న కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ముందు పార్లమెంట్ బడ్జెట్‌ను ఆమోదించే అవకాశం లభించింది.

# 20 నిమిషాల్లో కోటీశ్వరుడైన ట్రేడర్!



బ్యాంకులు కొన్నిసార్లు పొరపాటున లేదా అనుకోకుండా ఖాతాదారుల ఖాతాల్లో భారీ నగదు జమ చేసేస్తుంటాయి. జరిగిన తప్పు తెలుసుకుని మళ్లీ.. ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకుంటాయి. ఇలాంటి సంఘటనలు గతంలో కోకొల్లలుగా వెలుగులోకి వచ్చినప్పటికీ.. స్టాక్ మార్కెట్‌లో కూడా ఇలాంటి సంఘటన వెలుగులోకి రావడం బహుశా ఇదే మొదటిసారి. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. కోటక్ సెక్యూరిటీస్ సాంకేతిక లోపం కారణంగా.. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (F&O) ట్రేడర్ గజానన్ రాజ్‌గురు ఖాతాలోకి రూ. 40 కోట్లు బదిలీ చేసింది. ఈ మొత్తాన్ని చూసిన ట్రేడర్ కొంత ఆశ్చర్యానికి గురైనప్పటికీ.. ఆ డబ్బును పెట్టుబడిగా పెట్టి 20 నిమిషాల్లో ఏకంగా రూ. 2.38 కోట్ల లాభాన్ని గడించారు. ఆ తరువాత ఇందులో రూ. 54 లక్షల నష్టం వచ్చింది. ఆ తరువాత మరోసారి ట్రేడ్ చేసి.. చివరకు రూ. 1.74 కోట్ల లాభాన్ని పొందాడు. విషయం తెలుసుకున్న.. కోటక్ సెక్యూరిటీస్, ట్రేడర్ నుంచి 40 కోట్ల రూపాయలు మాత్రమే కాకుండా, అతడు ట్రేడ్ చేసి సంపాదించిన రూ. 1.75 కోట్ల లాభాన్ని కూడా తీసుకుంది. దీనిపై ట్రేడర్ కోర్టును ఆశ్రయించారు. అతని అభ్యర్థనను కోర్టు కూడా రెండు సార్లు తిరస్కరించినప్పటికీ.. అతడు మాత్రం పట్టు వదలకుండా ప్రయత్నిస్తుండడంతో.. చివరికి బాంబే హైకోర్టు రూ.1.75 కోట్ల లాభాన్ని తన వద్దే ఉంచుకోవడానికి అనుమతించింది. ట్రేడర్ తన సొంత తెలివితేటలను ఉపయోగించి రిస్క్ చేశారని, అందులో వచ్చిన లాభం తనకే చెందుతుందని కోర్టు తీర్పునిచ్చింది. అయితే 40 కోట్ల రూపాయలు కోటక్ సెక్యూరిటీస్ తీసుకోవడంలో తప్పులేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ తీర్పు.. ట్రేడింగ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.


# 5th ఫెయిల్, రూ.12తో మొదలై రూ.12,000 కోట్ల సామ్రాజ్యం




సూరత్‌కు చెందిన ఈ వజ్రాల వ్యాపారి సావ్జీ డోలకియా అనగానే అందరికీ గుర్తు వచ్చేది ప్రతి ఏటా తమ ఉద్యోగులకు ఖరీదైన బహుమతులు ఇవ్వడం. ఖరీదైన కార్లు ఇళ్లు, కార్లు, వజ్రాలు, ఆభరణాలు ఇలా ఎంతో విలువైన బహుమతులతో కేవం తన ఉద్యోగులను మాత్రమే కాదుయావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతారు. కానీ ఇలా ఖరీదైన బహుమతులు వచ్చేంత స్థాయికి రావడానికి వెనుక ఉన్న కృషిని గురించి ఎప్పుడైనా ఆలోచించారా? ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, అంచెలంచెలుగా ఎదిగి డైమండ్ సామ్రాజ్యాన్ని నిర్మించి, సావ్జీభాయ్‌గా పేరు గడించిన హరి కృష్ణ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు ఛైర్మన్, సావ్జీ ధోలాకియా సక్సెస్ గురించి తెలుసుకుందాం.గుజరాత్‌లోని దుధాల గ్రామానికి చెందిన ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టారు సావ్జీ ధోలాకియా. కుటుంబ ఆర్థిక పరిస్తితుల కారణంగా 5వ తరగతిలోనే చదువు ఆపేశారు. అంతేకాదు 1977లో కేవలం 13 ఏళ్ల వయసులోనే , జేబులో 12 రూపాయలు 50 పైసలు (బస్సు టికెట్‌కు సరిపోయే) సూరత్ నగరానికి పయనమయ్యాడు. అప్పటికి ఆయన మనసులో ఉన్నది కుటుంబానికి పోషించుకోవడం మాత్రమే. అలా సూరత్ నగరంలో తొలి ఉద్యోగం వజ్రాల కర్మాగారంలో. నెలకు రూ.179 రూపాయల జీతం. ఈ కొద్ది పాటి జీతంలోంచే ఆయన ప్రతి నెలా రూ. 39 పొదుపు చేసేవాడు. 1984లో తనకంటూ ఏదైనా సాధించాలనే కల మొదలైంది. ఈ కల సాకారానికి పట్టుదల ఓర్పుతోడైంది. తన సోదరులతో కలిసి, అతను 'హరి కృష్ణ ఎక్స్‌పోర్టర్స్' అనే చిన్న వజ్రాల వ్యాపారాన్ని ప్రారంభించాడు. వజ్రాల వ్యాపారం రిస్క్ తో కూడుకున్నది, పైగా పోటీ. దీంతో మొదట్లో వ్యాపారం చాలా కష్టమయ్యేది. కానీ ప్రజలపై సావ్జీభాయ్‌కి నమ్మకం వమ్ముకాలేదు. దీనికి తోడు ఉద్యోగులకు కార్మికుల్లాగా కుండా, తన ఇంట్లో మనుషుల్లాగా చూసుకునవాడు. అటు ఉద్యోగుల మనసుల్లోనూ, ఇటు వ్యాపారంలోనే అందనంత ఎత్తుకు ఎదిగాడు. ఉద్యోగులకు బోనస్‌లు ఇవ్వడం మాత్రమే కాదు, ఖరీదైన దీపావళి కానుకలిస్తూ సావ్జీభాయ్ ధోలాకియా వార్తల్లో నిలిచారు. ఆయన నమ్మింది ఒకటే. తన ఉద్యోగులకు బావుంటే.. కంపెనీ బావుంటుంది..వారి అభివృద్ధే తన వ్యాపారం అభివృద్ధి అని. అదే నమ్మకం నేటికీ కొనసాగుతోంది. 2025లో కూడా 3 కోట్ల రూపాయలకు పైగా విలువైన మూడు బ్రాండ్ న్యూ మెర్సిడెస్‌బెంజ్ GLS SUVలను కానుకగా ఇచ్చాడు. పాతికేళ్ళనుంచి తన కంపెనీలో సేవలందిస్తున్న నమ్మకమైన జట్టు సభ్యులు, ముగ్గురు సీనియర్ ఉద్యోగులకు బహుమతిగా ఇచ్చాడు. సావ్జీభాయి దృష్టిలో ఇటువంటి బహుమతులు అంటూ దుబారా కాదు, జీవితాంతం కలిసి చేసిన కృషికి, విజయానికి హృదయపూర్వక 'ధన్యవాదాలు'అంటారాయన. ఈ ప్రత్యేకమైన లక్షణమే ఒక చిన్న వర్క్‌షాప్‌గా మొదలైన ఆయన కంపెనీ ప్రపంచ వజ్రాల శక్తి కేంద్రంగా నిలిపింది. ఆభరణాల బ్రాండ్ 'కిస్నా వ్యాపారం ఇప్పుడు రూ. 12,000 కోట్లకు పైమాటే.. 2022లో, భారత ప్రభుత్వం సావ్జీభాయ్ ధోలాకియాను గుజరాత్‌లో సామాజిక సేవలో ఆయన చేసిన విశిష్ట సేవకు గాను దేశంలోని అత్యున్నత పౌర అవార్డులలో ఒకటైన పద్మశ్రీతో సత్కరించింది. బిలియనీర్ ,పద్మశ్రీ అవార్డు గ్రహీత సావ్జీభాయ్ ఇప్పటికీ చాలా సాదా సీదాగా ఉండే వ్యక్తి. ధోలాకియా 1996లో హరి కృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించారు. దాన్నే ధోలాకియా ఫౌండేషన్ అని పిలుస్తారు. దీని ద్వారా అనేక కార్యక్రమాలతోపాటు, చెట్లను నాటడం, నీటిని ఆదా చేయడం , భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని రక్షించడం కోసం కోట్లు ఖర్చు చేయడం విశేషం. మొక్కవోని పట్టుదల, అచంలమైన విశ్వాసంతో సాగిన ఆయన జీవితం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రేరణగా నిలుస్తున్నారు.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# దక్షిణాఫ్రికాలో నీలకంఠ వర్ణి అతిపెద్ద కాంస్య విగ్రహ ప్రతిష్ఠ



**జోహన్నెస్‌బర్గ్:** 18వ శతాబ్దపు యోగి, ఆధ్యాత్మిక గురువు నీలకంఠ వర్ణి 42 అడుగుల కాంస్య విగ్రహాన్ని దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో ప్రతిష్టించారు. అతిపెద్ద బోచాసన్‌వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ సంస్థ (బీఏపీఎస్) ఆలయంలో ఆదివారం ఈ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఇది దక్షిణాఫ్రికాలోనే అత్యంత ఎత్తైన కాంస్య విగ్రహం. వృక్షాసన భంగిమలో ఉన్న విగ్రహం ఈ ఆలయ భారీ సముదాయం ప్రవేశ ద్వారం వద్ద కొలువై ఉంది. ఇది కేవలం ఒక మతాన్ని ప్రతిబింబించే విగ్రహం కాదని, స్వీయ క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యం పట్ల ఉన్నత స్పష్టత, సమాజసేవ వంటి నీలకంఠ వర్ణి విలువలకు ప్రతీకని బీఏపీఎస్ ప్రతినిధి హేమాంగ్ దేశాయ్ తెలిపారు. రాగి, ఇత్తడితో తయారు చేసిన 20 టన్నుల బరువున్న ఈ విగ్రహం ఒకే కాలిపై నిలబడి ఉంటుందని, ఇది అసాధారణ ఇంజనీరింగ్ ఘనతకు తార్కాణమని అభివర్ణించారు. అత్యంత సీనియర్ సన్యాసులలో ఒకరైన స్వయంప్రకాశ్ స్వామి, దక్షిణాఫ్రికా ఉప ఆర్థిక మంత్రి అషోర్ సరూపెన్ సమక్షంలో అధికారికంగా విగ్రహాన్ని దక్షిణాఫ్రికాకు అప్పగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం పక్కనే బీఏపీఎస్ శాఖాహార రెస్టారెంట్ 'షయోనా'ఏర్పాటు చేశారు. ఇది గ్రేటర్ జోహన్నెస్‌బర్గ్ ప్రాంతంలోని పర్యాటకులకు ఖచ్చితంగా ఉపయోగపడుతుందని హేమాంగ్ అన్నారు.



# వెనెజువెలాపై మరొకసారి కాల్పుల మోత

వెనిజువెలా రాజధాని కారకాస్‌లోని మిరా ఫ్లోరెస్ అధ్యక్ష ప్యాలెస్ సమీపంలో మరొకసారి భారీ కాల్పులు మోత మోగింది. అమెరికా సైన్యం వెనెజువెలా అధ్యక్షుడు మడురోను పట్టుకున్న రెండు రోజుల తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. భారత కాలమాన ప్రకారం సోమవారం(జనవరి 5వ తేదీ) రాత్రి ఈ ఘటన జరిగింది. ప్యాలెస్‌పై డ్రోన్లు దాడి చేశాయి. వాటిని చూసి వెనెజువెలా భద్రతా దళాలు సైతం కాల్పులు జరిపాయి. ఇందుకు కారణం తెలియపోయినా ఇది అమెరికా దాడి తర్వాత ఏర్పడిన ఉద్రిక్తతల భాగంగా భావిస్తున్నారు. అమెరికా సైన్యం జనవరి 3న మడురో మరియు ఆయన భార్యను పట్టుకుని న్యూయార్క్‌కు తరలించింది. : వెనిజువెలా పార్లమెంట్ డెల్సీ రోడ్రిగ్స్‌ను తాత్కాలిక అధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేయించింది. గ అమెరికాతో సహకరించడానికి సిద్ధమని సంకేతాలు ఇచ్చారు రోడ్రిగ్స్ అమెరికాతో సహకరించడానికి సిద్ధమని సంకేతాలు ఇచ్చారు, కానీ మడురోను అమెరికా బంధీగా పేర్కొన్నారు., మడురోపై డ్రగ్ ట్రాఫికింగ్ కేసులు న్యూయార్క్ కోర్టులో కొనసాగుతున్నాయి.

# టేబుల్‌పై నోట్ల కట్టలు.. టీఎంసీ నేత..!

## బెంగాల్ రాజకీయంలో కలకలం రేపుతున్న వీడియో



**కోల్‌కతా:** ఓ టేబుల్‌పై నోట్ల కట్టల గుట్ట..ఆ వెనుక టీఎంసీ నేత ఒకరు కూర్చున్న వీడియో ఒకటి పశ్చిమ బెంగాల్‌లో వైరల్‌గా మారింది. ఉత్తర 24 పరగణాల జిల్లా బరాసత్-1 పంచాయతీ సమితి ఉపాధ్యక్షుడు మహ్మద్ గియాసుద్దీన్ మండల్, స్థానిక వ్యాపారి రకీబుల్ ఇస్లాంతోపాటు కూర్చుని ఉండగా వారికి ఎదురుగా ఉన్న టేబుల్‌పై పెద్ద మొత్తంలో డబ్బు కట్టలు కనిపిస్తున్నాయి. ఫోన్‌లో అవతలి వ్యక్తి.. 'కొనేది క్యాష్‌లోనా, ఫైనాన్స్‌లోనా అని అడుగుతుండగా, అప్పుడే మరోవ్యక్తి నోట్ల కట్టలు నింపి ఉన్న నైలాన్ బ్యాగ్‌తో ఆ గదిలోకి ప్రవేశించడం కనిపిస్తోంది. మరికొద్ది నెలల్లోనే రాష్ట్రం అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా వెలుగు చూసిన ఈ వీడియో రాజకీయ దుమారం రేపుతోంది. టీఎంసీ అక్రమ లావాదేవీలకు ఇదే నిదర్శనమంటూ ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. అయితే, ఇది 2022 నాటి పాత వీడియో అని మండల్ కొట్టిపారేస్తున్నారు. అది ఓ భూమి లావాదేవీకి సంబంధించిన అంశమని, తనకు ఎటువంటి సంబంధం లేదని చెబుతున్నారు. వీడియో కనిపిస్తున్న నగదు రెండేళ్ల క్రితం జరిగిన భూ లావాదేవీకి సంబంధించిందని రకీబుల్ ఇస్లాం కూడా తెలిపారు. ఇందులో ఎలాంటి తప్పిదం లేదని చెప్పారు. ఆ భూమి వ్యవహారంలో మండల్ భాగస్వామిగా ఉన్నారని, వీడియోలో కనిపించేది తన ఆఫీసు కూడా కాదని రకీబుల్ అన్నారు. ఈ అంశంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని బరాసత్-1 పంచాయతీ టీఎంసీ కన్వీనర్ మహ్మద్ ఇషా సర్కార్ చెప్పారు. వీడియోలో పెద్ద ఎత్తున కనిపిస్తున్న నగదుపై అనుమానాలు తలెత్తుతున్నాయని చెప్పారు. అది అసలైన వీడియోనా కాదా అనేది తేలుస్తామన్నారు. వీడియోపై బీజేపీ నేత తపస్ మిత్రా మాట్లాడుతూ.. స్థానిక భూ మాఫియా వెనుక మహ్మద్ గియాసుద్దీన్ మండల్ హస్తముందని ఆరోపించారు. ఈ వీడియోను చూస్తే అధికార టీఎంసీ అసలు స్వరూపం తేటతెల్లమవుతుందని విమర్శించారు.

# మాజీ కేంద్ర మంత్రి సురేష్ కల్మాడీ కన్నుమూత



**పూణే:** ప్రముఖ రాజకీయ నేత, మాజీ కేంద్ర మంత్రి సురేష్‌కల్మాడీ (81) నేడు (మంగళవారం) తుదిశ్వాస విడిచారు. పూణేలోని దీనానాథ్ మంగేష్కర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, ఆయన మరణించినట్లు కుటుంబ సభ్యులు ధృవీకరించారు. గత కొంతకాలంగా ఆయన వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. సురేష్‌కల్మాడీ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఎరందవనేలోని ఆయన నివాసం 'కల్మాడీ హౌస్'లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంచనున్నారు. అభిమానులు, రాజకీయ నేతలు ఆయనకు నివాళులు అర్పించేందుకు భారీగా తరలిరానున్నారని సమాచారం. మధ్యాహ్నం 3:30 గంటలకు పూణే నవీ పేటలోని వైకుంఠ స్మశానవాటికలో అధికారిక లాంఛనాలతో ఆయనకు అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు ఆయన కార్యాలయం తెలిపింది. భారత రాజకీయాల్లో కాంగ్రెస్ సీనియర్ నేతగా కల్మాడీ సుదీర్ఘ కాలం పనిచేశారు. 199596 మధ్య కాలంలో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రిగా సేవలందించారు. రాజకీయాల్లోకి ప్రవేశించకముందు ఆయన భారత వైమానిక దళంలో (ఐఏఎఫ్) పైలట్‌గా 1964 నుండి 1972 వరకు పనిచేశారు. క్రీడా రంగంలో భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) అధ్యక్షునిగా దేశీయ క్రీడా రంగంలో కీలక పాత్ర పోషించారు. భారత క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో ఎనలేని కృషి చేశారు. 010లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణలో నిధుల దుర్వినియోగం, అవినీతి ఆరోపణలు కల్మాడీ రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పాయి. ఈ కేసులో 2011లో ఆయన అరెస్ట్ కావడంతో కాంగ్రెస్ పార్టీ ఆయనను సస్పెండ్ చేసింది. అనంతరం 2016లో ఆయనను ఐఓఏ జీవితకాల అధ్యక్షుడిగా నియమించినప్పటికీ, తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ పదవిని తిరస్కరించారు.

# ఇండోనేషియాలో వరద బీభత్సం.. 14 మంది మృతి



**జకార్తా:** ఇండోనేషియాను వరదలు ముంచెత్తుతున్నాయి. దేశంలోని ఉత్తర సులవేసి ప్రావిన్స్‌లో గల సియావు ద్వీపంలో అకస్మాత్తుగా సంభవించిన వరదలు భీభత్సం సృష్టించాయి. భారీ వర్షాలు, ఒక్కసారిగా తాకిన వరద ఉధృతికి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రకృతి విపత్తులో మరో నలుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం స్థానిక సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున కురిసిన అతి భారీ వర్షం సియావు ద్వీపాన్ని అతలాకుతలం చేసింది. ఈ విపత్తులో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. వరద తాకిడికి రోడ్లు, భవనాలు తదితర మౌలిక సదుపాయాలు భారీగా దెబ్బతిన్నాయి. సహాయక చర్యల నిర్వహణ ప్రతినిధి నూరియాదిన్ గుమెలెంగ్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 16 మంది నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాలు గల్లంతైన వారి కోసం గాలిస్తున్నాయి. కాగా వరద నీటితో పాటు కొట్టుకువచ్చిన బురద, శిథిలాల కారణంగా రహదారులు పూర్తిగా మూసుకుపోయాయి. ఎక్స్‌కవేటర్లను ఉపయోగించి, ఈ అడ్డంకులను తొలగించేందుకు అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. విపత్తు నిర్వహణ సంస్థ ప్రతినిధి అబ్దుల్ ముహారీ అందించిన సమాచారం ప్రకారం ప్రభావిత ప్రాంతాల నుండి ఇప్పటి వరకు 444 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. ఇండోనేషియా వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే కొన్ని నెలల పాటు ఈ ప్రాంతంలో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో సహాయక చర్యలకు ఆటంకం కలగనుంది. అలాగే మరిన్ని ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అక్కడి ప్రజలకు అధికారులు సూచించారు.



## సంక్రాంతికి రిలీజ్ అంటే చాలా మంది నమ్మలేదు : అనిల్ సుంకర

"స్క్రిప్ట్ విని, ఈ కథతో సినిమా చేయగలమా? లేదా అనే ఓ జడ్జ్‌మెంట్‌కు రాగలగాలి. సినిమా రిజల్ట్ ఎలాగూ మన చేతిలో ఉండదు. అందుకే సినిమా స్క్రిప్ట్ లెవల్లోనే అన్నీ జాగ్రత్తగా చూసుకోగలగాలి. అఖిల్‌తో మేం చేసిన 'ఏజెంట్' సినిమాకు బౌండ్ స్క్రిప్ట్ లేదు. దాంతో ఆ సినిమాకు సరైన ఫలితం రాలేదు. అందుకే మంచి స్క్రిప్‌ట్‌తో వస్తేనే సినిమా చేయాలని నిర్ణయించుకున్నాను. స్క్రిప్ట్ ప్రకారం సినిమా వచ్చిందంటే ఆ సినిమా బాగున్నట్లే'' అని చెప్పారు. నిర్మాత అనిల్ సుంకర. శర్వానంద్ హీరోగా నటించిన తాజా చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. ఈ చిత్రంలో సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటించారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న సాయంత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో అనిల్ సుంకర మాట్లాడుతూ–''నారీ నారీ నడుమ మురారి' పండగ మూవీ. ఆద్యంతం వినోదభరితంగా సాగే చిత్రం ఇది. ఈ చిత్రంలో శర్వానంద్ మంచి క్యారెక్టర్ చేశారు. శ్రీవిష్ణు గెస్ట్ రోల్ చేశారు. ఒకే ఆఫీసులో ఓ అబ్బాయి మాజీ ప్రేమికురాలు, ఆ అబ్బాయి ప్రస్తుత లవర్ ఉంటే... ఆ అబ్బాయి పరిస్థితి ఏమిటి? అన్నదే ఈ సినిమా కథ. పెళ్లి నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ఆడియన్స్‌ను ఆకట్టుకుంటాయి. మా సినిమాను మేం సంక్రాంతికి రిలీజ్ చేస్తాం అంటే చాలా మంది నమ్మలేదు. కొంతమంది నాకు ఫోన్ చేసి అడిగారు. కానీ మేం ముందుగా చెప్పినట్లే సంక్రాంతికి వస్తున్నాం. ఈ చిత్రాన్ని నైజాం, వైజాగ్ ఏరియాల్లో 'దిల్' రాజుగారు, వెస్ట్, కృష్ణా, గుంటూరులో రాజా, సీడెడ్‌లో శోభన్ రిలీజ్ చేస్తున్నారు. ఈస్ట్‌లో మేమే సొంతంగా రిలీజ్ చేస్తున్నాం. ఇక సంక్రాంతి సీజన్‌లో నాలుగైదు సినిమాలు రావడం అనేది కామన్. ఈ సీజన్‌లో విడుదలైన సినిమాలన్నీ హిట్ అయిన సందర్భాలూ ఉన్నాయి.


## మన శంకరవరప్రసాద్ గారు
# సీక్వెల్‌పై క్లారిటీ!

ఈ మధ్య చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి సినిమా చివరన సీక్వెల్ ప్రకటించడం ట్రెండ్‌గా మారిపోయింది. కొన్ని సినిమాల కథలు ఒకే పార్ట్‌లో చూపించలేక.. రెండో భాగం తెరకెక్కిస్తుంటే..మరికొన్ని సినిమాలు మాత్రం పూర్తిగా ముగిసిన కథకు కూడా సీక్వెల్‌ని ప్రకటిస్తున్నారు. కథ రేడీగా ఉండదు కానీ ముందే సీక్వెల్ ప్రకటిస్తారు. సినిమా హిట్ అయితే..అప్పుడు కథని డెవలప్ చేస్తారు. ఒకవేళ ఫ్లాప్ అయితే.. సీక్వెల్ ప్రకటించినప్పటికీ..మళ్లీ దాని జోలికి వెళ్లరు. అలా ఎన్నో సినిమాల సీక్వెల్స్ ఆగిపోయాయి. అయినా కూడా సీక్వెల్ ప్రకటించడం మాత్రం ఆగడం లేదు. చిరంజీవి కొత్త సినిమా 'మన శంకర్ వరప్రసాద్ గారు'కి కూడా సీక్వెల్ ఉంటుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ పుకార్లపై నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల స్పందించారు. ఈ సినిమాకు సీక్వెల్ లేదని స్పష్టం చేశారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా నిర్మాతలు సాహు, సుస్మిత తాజాగా మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా 'మన శంకర్ వరప్రసాద్'కి సీక్వెల్ ఉంటుందా? అని ఓ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. 'ఇది కంప్లీట్ ఎండింగ్ మూవీ. క్లైమాక్స్‌లో పార్ట్ 2 ప్రకటన ఏమి ఉండదు. అసలు ఆ ఆలోచన కూడా మాకు లేదు' అని స్పష్టం చేశారు. మనశంకర్ వరప్రసాద్ విషయానికొస్తే.. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా నయనతార నటిస్తోంది. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్ర పోషించాడు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ చిత్రం విడుదల కాబోతుంది.









## అక్కినేని హీరోతో పెళ్లి..
### మీనాక్షి చౌదరి ఏమన్నారంటే..

సినీ తారల ప్రేమ, పెళ్లి విషయాలపై పుకార్లు కామన్. వాళ్లు నిజంగా ప్రేమలో ఉన్నా లేకపోయినా సరే.. సోషల్ మీడియాలో అయితే లెక్కలేనన్ని గాసిప్పులు వచ్చేస్తుంటాయి. అయితే కొంతమంది తారలు వాటిని లైట్‌గా తీసుకొని స్పందించకుండా ఉంటారు. మరికొంతమంది అయితే క్లారిటీ ఇస్తుంటారు. ఈ రెండో కోవాకు చెందిన హీరోయిన్‌నే మీనాక్షి చౌదరి. ఈ బ్యూటీపై ఇటీవల ఓ రూమర్ గట్టిగా వినిపించింది. అక్కినేని యంగ్ హీరో సుశాంత్‌తో మీనాక్షి(Meenakshi Chaudhary ) ప్రేమలో పడిందని.. త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వచ్చాయి. తాజాగా ఈ పుకార్లపై మీనాక్షి స్పందించింది. సుశాంత్ తనకు మంచి ఫ్రెండ్ మాత్రమేనని.. అంతకు మించి తమ మధ్య ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. 'ఇలాంటి పుకార్లు విని నవ్వుకుంటాను. సుశాంత్, నేను మంచి స్నేహితులం మాత్రమే. మేమిద్దరం కలిసి నటించాం(మీనాక్షి తొలి సినిమా 'ఇచ్చట వాహనాలు నిలపరాదు' సుశాంత్ హీరో). అంతకు మించి మా మధ్య ఎలాంటి సంబంధం లేదు. అయినా ఇండస్ట్రీలో అవన్నీ కామన్. రోజుకో గాసిప్ వస్తుంది. అవన్నీ నిజం కాదనీ అందరికీ తెలుసు. నేను కూడా వాటిని మైండ్‌కి తీసుకోను. అలా విని..ఇలా వదిలేస్తా' అని ఓ ఇంటర్వ్యూలో మీనాక్షి చెప్పుకొచ్చింది. మీనాక్షి నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు'. నవీన్ పొలిశెట్టి హీరోగా నటించిన ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలోనే తన పెళ్లి పుకార్లపై స్పష్టత ఇచ్చింది.

## గత ఏడాది ఆశాజనకంగా
# లేదు కానీ..: త్రిష

పరిశ్రమకు చెందిన ప్రతి ఒక్కరూ తమ చిత్రాలు విజయవంతం కావాలనే కోరుకుంటారు. అందుకోసమే శ్రమిస్తుంటారు. అయితే జయాపజయాలు ఎవరి చేతుల్లోనూ ఉండవు. ఒక్కోసారి బాగున్న కథా చిత్రాలు కూడా ప్రజాదరణకు నోచుకోవడంలో విఫలం అవుతుంటాయి. అందుకు పలు కారణాలు ఉండవచ్చు. నటి త్రిష విషయానికే వస్తే కథానాయకిగా స్వర్ణోత్సవానికి చేరువవుతున్నారు.

తమిళం,తెలుగు,కన్నడం,మలయాళం,హిందీ భాషల్లో నటించి పాన్ ఇండియా కథానాయకిగా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ మధ్యలో నటిగా కాస్త స్ట్రగుల్ పడి అవకాశాలకు దూరం అయ్యారు. అలాంటి తరుణంలో మణిరత్నం రూపంలో పొన్నియిన్ సెల్వన్ చిత్రంలో నటించే అవకాశం వరించి సెకెండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. ఆ తరువాత విజయ్, అజిత్, కమలహాసన్ వంటి ప్రముఖ హీరోలతో జత కట్టారు. అదే విధంగా మలమాళంలో మోహన్‌లాల్, తెలుగులో చిరంజీవి వంటి ప్రముఖ హీరోలతో నటించే అవకాశాలను అందుకున్నారు. అయితే గత ఏడాది త్రిష నటించిన చిత్రాల్లో అజిత్‌తో జంటగా నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ మినహా ఇతర చిత్రాలు ఆశించిన విజయాలను అందుకోలేకపోయాయి. ముఖ్యంగా అజిత్‌కు జంటగా నటించిన మరో చిత్రం విడాముయర్చి, కమలహాసన్‌తో కలిసి నటించిన థగ్ లైఫ్ చిత్రాలు పూర్తిగా నిరాశ పరిచాయి. కాగా ప్రస్తుతం త్రిష మార్కెట్ డల్‌గా ఉందని చెప్పక తప్పదు. కాగా ఈమె సూర్యకు జంటగా నటించిన కరుప్ప చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకుని ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ చిత్రం సమ్మర్ స్పెషల్‌గా తెరపైకి రానుంది. అదేవిధంగా తెలుగులో చిరంజీవి సరసన నటిస్తున్న విశ్వంభర చిత్రం కూడా చిత్రీకరణను పూర్తి చేసుకుని ప్రస్తుతం గ్రాఫిక్స్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఈ చిత్రం కూడా మార్చి నెలలో విడుదలకు సిద్ధం అవుతోంది. అదేవిధంగా మలయాళంలో మోహన్‌లాల్ కు జంటగా రామ్ అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇవన్నీ గత ఏడాది, అంతకు ముందు ఏడాది అంగీకరించిన చిత్రాలు అన్నది గమనార్హం. దీంతో త్రిష కొత్తగా ఒప్పుకున్న చిత్రాలు లేవు. అయితే ప్రస్తుతం ఓ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నట్లు సమాచారం. నాలుగు పదుల వయసు దాటిన ఈ పెళ్లి కాని నటికి తాజాగా మరో రెండు చిత్రాల్లో నటించే అవకాశం వచ్చిందని, వాటికి సంబంధించిన చర్చలు జరుగుతున్నట అందుకే త్రిష కూడా గతేడాది తనకు ఏమంతగా ఆశాజనకంగా లేదని చెప్పకొస్తుందట. అయితే, 2026లో తను నటించిన భారీ సినిమాలు రెండు విడుదల కానున్నాయి.

## యశ్ టాక్సిక్‌లో మరో స్టార్ హీరోయిన్ ఎంట్రీ

కన్నడ నటుడు యశ్ జోరు పెంచాడు.. 'కేజీఎఫ్, కేజీఎఫ్ 2' వంటి బ్లాక్‌బస్టర్స్ తర్వాత ఆయన హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. కియారా అద్వానీ, నయన తార, హూమా ఖురేషి, తారా సుతారియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే వారి పోస్టర్స్‌ను విడుదల చేశారు. అయితే, తాజాగా ఇందులో రుక్మిణి వసంత్ కూడా నటిస్తున్నారని మేకర్స్ ప్రకటించారు. ఇందులో ఆమె మెలిసా అనే పాత్రలో కనిపించనున్నట్లు ఒక పోస్టర్‌ను షేర్ చేశారు.

టాక్సిక్ నుంచి ఇప్పటికే నలుగురు హీరోయన్ల ఫస్ట్‌లుక్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి నదియా పాత్రలో నటిస్తోన్న కియారా అద్వానీ, గంగ పాత్ర చేస్తున్న నయనతార, హూమా ఖురేషి నటిస్తున్న ఎలిజిబెత్ పాత్రలతో పాటు తారా సుతారియా చేస్తున్న రెబెకా పాత్రను పరిచయం చేశారు. అయితే, తాజాగా మెలిసా పాత్ర కోసం రుక్మిణి వసంత్‌ను తీసుకున్నారు.

గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో తెరకెక్కుతోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్ స్టర్ మైండ్ క్రియేషన్స్పై వెంకట్ కె.నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఇంగ్లీష్, కన్నడ భాషల్లో నేరుగా, హిందీ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో డబ్బింగ్ వెర్షన్‌ని మార్చి 19న రిలీజ్ చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com